ఈనాడు
కర్ణాటక
శుక్రవారం అక్టోబరు 4, 2024



చాముండేశ్వరి మాతకు పూజ చేసి.. మైసూరు వేడుకలు ప్రారంభిస్తున్న ప్రముఖ సాహితీవేత్త హంప నాగరాజయ్య. చిత్రంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితరులు



మైసూరు రాజమందిరంలో ప్రైవేటు దర్బారు నిర్వహిస్తున్న రాజవంశీకుడు యదువీర్ కృష్ణదత్త ఒడెయరు

అంబారి వేడుక.. నవరంగ దీపిక

- మైసూరు సంబరాలు షురూ
- అతిరథ, మహారథుల ఆగమనం
- శాంతి, అభివృద్ధి సాధనే లక్ష్యం

ఈనాడు, బెంగళూరు : రాచనగరి మైసూరులో తొమ్మిది రోజులపాటు కొనసాగే దసరా సంబరాలకు గురువారం ఢంకామోగించారు. ఏడాది కిందట ఇదే రోజున రాష్ట్రమంతటా కరవు మేఘాలు కమ్ముకున్నాయి. జలాశయాలన్నీ అడుగంటిన వేళ తల్లి చాముండేశ్వరికి ప్రత్యేక పూజలు చేసిన ఏలికలు వర్షాల కోసం ప్రార్థించారు. నిత్యం రాజకీయ ద్వేషాలతో ఒకరిపై ఒకరు విమర్శలతో దండెత్తే పాలకులు వచ్చే దసరా నాటికి సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రార్థించారు. వీరి ప్రార్థనలు ఫలించినట్లే.. ఈ దసరా నాటికి రాష్ట్రంలో జలాశయాలన్నీ నిండుకుండల్లా మారాయి. ఈ ఉత్సవాల రోజుల్లోనే శ్రీరంగపట్టణంలోని కావేరి మాతకు ఐదు రోజుల పాటు హారతి సమర్పించాల్సిన సర్కారుకు.. కళకళాడుతూ కావేరి నది స్వాగతం పలుకుతోంది. గతేడాది దసరా రోజున ప్రకృతి ప్రసన్నం కోసం ప్రార్థించిన పాలకులు ఈసారి మరో తరహా సమస్యలపై మనసులోనే విన్నపాలు చేసి ఉంటారు. ఇందుకు కారణం పార్టీలకు అతీతంగా రాజకీయ నేతలంతా ఎన్నడూ చూడనంతగా కేసుల వలలో చిక్కుకుని తల్లడిల్లుతున్నారు. ఈ సమస్యల నుంచి విముక్తి కోసం చాముండేశ్వరికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మరోవైపు ప్రపంచాన్ని వణికిస్తున్న ఇజ్రాయెల్‌-పాలస్తీనా, రష్యా-ఉక్రెయిన్‌ యుద్ధాలు విరమించి ప్రజలకు శాంతి చేకూర్చాలని ఈసారి ప్రత్యేకంగా ఏలికలు మనవి చేశారు.

రంగుల దసరా..

కర్ణాటక పర్యాటక రంగానికి సింహభాగమైన రాచనగరి మైసూరు మరో దసరా సంబరానికి గురువారం తెరలేపింది. ఈ రంగుల దసరా ఉత్సవాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన మంత్రివర్గ సహచరులతో కలిసి ప్రారంభించారు. తాను ఒకవైపు ఇదే జిల్లా నగరాభివృద్ధి సంస్థ స్థలాల అక్రమాలో ఆరోపణలు ఎదుర్కొంటున్నా ఆ ప్రభావాన్ని ఉత్సవాల నిర్వహణపై పడకుండా జాగ్రత్తపడ్డారు. గతేడాది కంటే మిన్నగా.. ఆడంబరంగా నిర్వహించాలని అధికారులకు సూచనలిచ్చారు. ఆయన సూచనల ప్రకారం జిల్లా ఇన్‌ఛార్జ్‌ మంత్రి హెచ్‌.సి.మహదేవప్ప, కన్నడ, సంస్కృతి శాఖ మంత్రి శివరాజ్‌ తంగడిగి, జిల్లా అధికార యంత్రాంగమంతా దేశీయ, విదేశీ పర్యాటకుల రాక కోసం అన్ని వ్యవస్థలనూ సిద్ధం చేశారు. గతేడాది దసరా రోజున గృహలక్ష్మి పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి ఈ పథకంలోని తొలి చెక్‌ను చాముండేశ్వరికి సమర్పించారు. ఏడాది ముగిసేలోగా మిగిలిన అన్ని గ్యారంటీ పథకాలను అమలు చేసి వాటి ప్రగతిని ప్రతిబింబించేలా ఈ ఉత్సవాల్లో ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఎప్పటిలాగానే ప్రభుత్వ పథకాల వస్తు ప్రదర్శనతో పాటు ఉత్సవాల సంప్రదాయంలో భాగమైన క్రీడలు, కుస్తీ, యువ, రైతు, పుస్తక, సాంస్కృతిక, గాన, కళా, యోగా, ఆహార, చలనచిత్ర ప్రదర్శనలను అంతే ఉత్సాహంతో ప్రారంభించారు. ఈ ఏడాది మైసూరు దసరా ఉత్సవ సమితి నేతృత్వంలో కార్యక్రమాలను తీర్చిదిద్దినా ప్రత్యేక అతిథిని ఎంపిక చేసే బాధ్యత ముఖ్యమంత్రి తీసుకున్నారు. తాను ఎంతగానో ఇష్టపడే జైన సాహితీవేత్తగా గుర్తింపు పొందిన హంప నాగరాజయ్యను విశిష్ట అతిథిగా ఎంపిక చేశారు. ఆయనే చాముండీమాతకు పూజలు నిర్వహించి.. సంప్రదాయంగా వేడుకల ఢంకా మోగించారు. ఓ వైపు ఏ క్షణంలోనైనా మైసూరు లోకాయుక్త కార్యాలయానికి, బెంగళూరు ఈడీ కార్యాలయానికి వెళ్లాల్సిన ముఖ్యమంత్రి దసరా ఉత్సవాల్లో మాత్రం ఎంతో ప్రశాంతంగా కనిపించి తన గాంభీర్యాన్ని చాటుకున్నారు.



‘చిక్క’ దుర్బాంగ : నవశక్తి మాత.. చిక్కమగళూరులో దర్శనమిచ్చిన వేళ..

మాట నెరవేర్చాం..


రాష్ట్ర ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం గ్యారంటీ పథకాలను అమలు చేసి వారి సామాజిక, ఆర్థిక స్థితిని మెరుగుపరచామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ సందర్భంగా ప్రకటించారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఎనిమిది నెలలకే ఐదు గ్యారంటీలను పట్టాలెక్కించామన్నారు. రాజ్యాంగ ఆశయాలను నెరవేర్చేలా బడుగు వర్గాల స్వావలంబన కోసం వారికి ఏటా రూ.40 వేల నుంచి రూ.50 వేల ఆర్థిక సాయం అందేలా గ్యారంటీలను అమలుచేశామని తెలిపారు. గృహలక్ష్మి ద్వారా 1.21 కోట్ల కుటుంబ యజమానులకు, గృహజ్యోతి ద్వారా 1.40 కోట్ల కుటుంబాలకు, యువనిధి సాయంతో 1.82 లక్షల మంది నిరుద్యోగులకు ఆర్థిక సాయం అందించగలిగామన్నారు. ఈ ఏడాది భారీ వర్షాలతో రైతులంతా సంతోషంగా ఉన్నారని వివరించారు. రాష్ట్రంలో ముంగారు పంటకు 99 శాతం విత్తన ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని వర్షాలు వచ్చే వీలుందనే అశాభావం వ్యక్తం చేశారు. తల్లి చాముండేశ్వరి దయ వల్ల మంచి వర్షాలు కురిశాయని ముఖ్యమంత్రి అన్నారు. దసరా అంటే ప్రజల పండగలా ఉండాలి తప్ప అధికారులకు వేడుక కారాదన్నారు. ప్రజలు ఎంత ఎక్కువగా పాల్గొంటే ఈ ఉత్సవానికి అంత ఉత్సాహం ఉంటుందన్నారు. ఇక కన్నడ సాహిత్యానికి విశిష్ట సేవలందించిన సాహితీవేత్త హంప నాగరాజయ్యను ఎంపిక చేసే అదృష్టం తనకు లభించిందని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆయనకు ఈ గౌరవం ఎప్పుడో దక్కాల్సి ఉందన్నారు. ఇటీవల మరణించిన ఆయన సతీమణి కమలా హంపకూ ఆ అర్హత ఉన్నా ఆమె మన మధ్యలో లేరని విచారం వ్యక్తం చేశారు. ఇదే సందర్భంగా తనకు చాముండేశ్వరి ఆశీర్వాదంతో పాటు ప్రజల అభిమానం ఉందని ప్రకటించారు. ఆ కారణంగానే నేను రెండుసార్లు ముఖ్యమంత్రి కాగలిగానని తెలిపారు. ఇటీవల నాపై కొన్ని ఆరోపణలు వచ్చాయని, అవినీతికి పాల్పడితే ఇన్నేళ్ల పాటు రాజకీయాల్లో ఉండేవాడిని కానన్నారు. ప్రజలిచ్చిన అవకాశంతో ఐదేళ్ల పాటు ప్రభుత్వం కొనసాగుతుందన్నారు.

యుద్ధ కాంక్ష ఏల?

లక్షలాది అమాయకులను ఇక్కట్లకు గురి చేస్తున్న ఇజ్రాయెల్‌- పాలస్తీనా, రష్యా-ఉక్రెయిన్‌ యుద్ధాలను విరిమింపజేయాలని చాముండేశ్వరిని ప్రార్థిస్తున్నానని దసరా ఉత్సవాలను ప్రారంభించిన సాహితీవేత్త హంప నాగరాజయ్య ప్రకటించారు. ఓ సామాన్యుడు దసరా ఉత్సవాలను ప్రారంభించే అవకాశం ప్రజాస్వామ్య వ్యవస్థలోనే సాధ్యమన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చే ప్రయత్నాలు ఇకనైనా మానాలని ఆయన విపక్షాలు చేస్తున్న ప్రయత్నాలను ఉటంకిస్తూ సూచించారు. ఇదే సందర్భంగా ఇన్నేళ్లయినా శాసనసభల్లో మహిళల ప్రాధాన్యం పెరగలేదని తన ప్రసంగంలో గుర్తు చేశారు. స్త్రీ భ్రూణ హత్యల నియంత్రణ, నిరుద్యోగం, రాజకీయ ద్వేషాలతో పరస్పర నిందలతో యువతకు తప్పుడు సందేశాలు ఇచ్చే విధానాలకు స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు.



మైసూరు సినీ సంబరాలు ప్రారంభిస్తున్న సిద్ధరామయ్య.. చిత్రంలో రాజకీయ, సినీరంగ ప్రముఖులున్నారు..



సువర్ణ సింహాసనంపై ఆసీనులయ్యే ముందు.. పూజలు చేస్తున్న యదువీర్

రాజాధిరాజా.. మార్తాండ తేజా!

మైసూరు, న్యూస్‌టుడే : విఖ్యాత దసరా ఉత్సవాల్లో భాగంగా రాజవంశస్థుడు యదువీర్‌ కృష్ణదత్త చామరాజ ఒడెయరు రత్నఖచిత సింహాసనాన్ని అధిష్ఠించి ప్రైవేటు దర్బారు నిర్వహించిన ఘట్టం గురువారం కాంతులీనింది. వరుసగా పదో ఏడాది ఆయన దర్బారు నిర్వహించారు. మైసూరు-కొడగు ఎంపీగా మొదటిసారి ఈసారి పూజల్లో పాల్గొన్నారు. రాజమాత ప్రమోదా దేవి ఆశీస్సులు అందుకుని, వందిమాగధుల జయకారాల నడుమ ప్యాలెస్‌లోకి ఒడెయరు చేరుకున్నారు. ముత్యాలు, మణులు పొదిగిన లేత నేరేడు రంగు మైసూరు తలపాగా, పట్టు కుర్తా, పైజామా, భుజం, నడుము చుట్టూ దానిమ్మ, తెలుపు వర్ణం శాలువా, గండభేరుండ లాంఛనం ఉన్న రత్నఖచిత హారం ఆయన ధరించారు. రాజపోషకులు వెంటరాగా వంశపారంపర్యంగా వస్తున్న ఆభరణాలు ధరించి.. రాజ ఖడ్గాన్ని పట్టుకుని ఉదయం 11.35కి ప్యాలెస్‌ ఆవరణలోకి చేరుకున్నారు. అక్కడే 12.05 వరకు పూజలు నిర్వహించి, సింహాసనాన్ని అధిష్ఠించారు. దర్బార్‌ హాల్‌లో నవగ్రహ పూజ, సింహాసనం ముందుంచిన సింహం ముఖ లాంఛనం, కలశాలకు అక్షితలు, కుంకుమ, పసుపు, పూలు వేసి, గంధంతో చేసిన ఊదు బత్తీ వెలిగించి, మంగళహారతి వెలిగించి పూజ చేశారు. అనంతరం సింహాసనం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసిన తర్వాత దాన్ని అధిరోహించారు. సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించి దర్బారు ప్రారంభించారు. ఇదే సమయంలో కర్ణాటక పోలీసు బ్యాండ్‌ సిబ్బంది ‘కాయో శ్రీ గౌరీ’ గీతాన్ని బ్యాండ్‌పై వాయించారు. అనంతరం శ్రీమహాగణపతీం, సరస్వతీ భగవతీం, బ్రహ్మమురారి, ఐగిరి నందిని, విజయాంబిక, శ్రీ చాముండేశ్వరి, భాగ్యదా లక్ష్మీ బారమ్మ. . తదితర పాటలను వాయించారు. సుమారు అరగంట పాటు సింహాసనంపై కూర్చుని యదువీర్‌ ప్రైవేటు దర్బారు నిర్వహించారు. చాముండి బెట్ట, పరకాల మఠం, నంజనగూడు, మేలుకోటె, శ్రీరంగపట్టణ, శృంగేరి తదితర 23 ఆలయాల నుంచి తీసుకు వచ్చిన పూర్ణఫల ప్రసాదాన్ని స్వీకరించారు. దర్బారు నిర్వహణకు సహకారం అందించిన వారికి యదువీర్‌ చిరు కానుకలను అందించి, సింహాసనం నుంచి కిందకు దిగారు. విజయదశమి వరకు నిత్యం కొంత సమయంలో ఆయన ప్రైవేటు దర్బారును నిర్వహిస్తారు.



మైసూరు రాజవంశీకుడు యదువీర్‌ కృష్ణదత్త ఒడెయరును అంతఃపురంలోకి ఆహ్వానిస్తున్న భటులు

జీటీ రాజకీయ దుమారం



మాజీ మంత్రి జీటీ దేవేగౌడ


ఈనాడు, బెంగళూరు : మైసూరు ఉత్సవాల సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జనతాదళ్‌ నేత, శాసనసభ్యుడు జి.టి.దేవేగౌడ చేసిన ప్రసంగం రాజకీయ దుమారం లేపింది. తన రాజకీయ జీవితంలో ఏనాడూ అవినీతికి పాల్పడని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు చివరి రోజుల్లో ఆరోపణలు వెల్లువెత్తాయని, కేసు నమోదు చేయగానే రాజీనామా చేయాలన్న విపక్షాల డిమాండ్‌ను ఆయన వేదిక పైనుంచే ఖండించారు. ఇలాగయితే భాజపా నుంచి ఆర్‌.అశోక్‌, జేడీఎస్‌ నుంచి కుమారస్వామి వెంటనే రాజీనామా చేయాలని నినదించారు. కోర్టులేవీ ముఖ్యమంత్రి నుంచి రాజీనామా కోరలేదని ఆయన గుర్తు చేశారు. ఇదే సందర్భంగా గ్యారంటీలను ఉన్నతంగా అమలు చేసిన ముఖ్యమంత్రి సిద్ధు మైసూరు నగరాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలని కోరారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ మాట్లాడుతూ రాజకీయాలు సవాళ్లతో కూడుకున్న వేదికని వివరించారు. ధైర్యంతో పోరాడితేనే ఇక్కడ కొనసాగుతామన్నారు. రాష్ట్రానికి నలువైపులా దుర్గామాత వివిధ రూపాల్లో ఉంటూ రక్షణ కల్పిస్తోందన్నారు. ఆమె ఆశీర్వాదంతో గ్యారంటీ పథకాలను ప్రారంభించి వాటిని విజయవంతంగా అమలు చేశామని గుర్తు చేశారు.



మురిసిన తీరనగరి: మంగళూరు నగర కుద్రోళి గోకర్ణనాథ ఆలయంలో దసరా ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయ వీధులు దీపాలంకరణలతో కళకళలాడాయి. అమ్మవారు సింహాలు పూన్చిన వాహనంపై వస్తున్నట్లు ఏర్పాటు చేసిన విగ్రహం భక్తులను ఆకట్టుకుంది. మంగళూరుతో పాటు కొడగు, శ్రీరంగపట్టణ, చామరాజనగర, తుమకూరుల్లోనూ దసరా వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. **(న్యూస్‌టుడే, మంగళూరు)**



ఫల, పుష్ప ప్రదర్శన వేదిక.. మైసూరు గాజుమందిరం ముంగిట సుమ ఫిరంగులు!



పుష్ప ప్రదర్శనలో ఆకట్టుకునే ‘అనుభవ మండప’ నిర్మాణ వైభవం

ఆగిపోయిన ‘సిద్ధు’ సినిమా

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య జీవిత చరిత్ర ఆధారంగా ‘లీడర్‌ సిద్ధరామయ్య’ చిత్ర నిర్మాణానికి ఆటంకాలు ఎదురయ్యాయి. ముడా అక్రమాలు, ఇతర ఆరోపణలు రావడంతో చిత్రీకరణను తాత్కాలికంగా నిలిపి వేశారు. దర్యాప్తు ఒక కొలిక్కి వచ్చిన అనంతరం మళ్లీ ప్రారంభించనున్నారు. ప్రముఖ నటుడు విజయ్‌ సేతుపతి కథానాయకునిగా, బెంగళూరుకు చెందిన దర్శకుడు సత్యరత్నం తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి గంగావతికి చెందిన హయ్యత్‌ పీర్‌ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

తుపాకులతోనే ఆత్మరక్షణ

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : బీఎంటీసీ సిబ్బంది ఆత్మరక్షణకు తుపాకులు ఇవ్వాలని కోరుతూ సంస్థ ఎండీకి కొందరు లేఖలు రాశారు. మంగళవారం వైట్‌ఫీల్డ్‌లో యోగేశ్‌ అనే కండక్టర్‌పై ఒక యువకుడు కత్తితో దాడి చేశాడు. గతంలో పలుమార్లు సిబ్బందిపై ఇలానే దాడులు చేశారు. ఈ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని తమకు తుపాకులను మంజూరు చేయాలని సిబ్బంది లేఖలు రాశారు.

భారీగా ఆభరణాల స్వాధీనం

ధార్వాడ, న్యూస్‌టుడే : ముంబయి నుంచి హుబ్బళ్లికి రెండు సంచుల్లో తీసుకు వస్తున్న రూ.77 లక్షల విలువైన ఆభరణాలను ధార్వాడ గ్రామీణ ఠాణా పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. బస్సులో భవర్‌ సింగ్‌ అనే వ్యక్తి ఆభరణాలను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు కార్యాచరణ నిర్వహించారు. నగలకు సంబంధించి భవర్‌సింగ్‌ ఎటువంటి వివరాలు ఇవ్వకపోవడంతో వాటిని జప్తు చేసుకుని విచారణ చేపట్టామని పోలీసులు తెలిపారు.

కుమారపై ఫిర్యాదు బాంబు



కుమారస్వామి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : రూ.50 కోట్లు ఇవ్వాలని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తనను బెదిరించారని ఓ భూవ్యాపారి ఆరోపించారు. కుమారస్వామి, మాజీ ఎమ్మెల్సీ రమేశ్‌గౌడలపై అమృతహళ్లి ఠాణాలో ఇదే అంశంపై గురువారం ఫిర్యాదు చేశారు. చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో యువనేత నిఖిల్‌ పోటీ చేస్తున్నారని, ఖర్చులకు డబ్బు కావాలంటూ రమేశ్‌ గౌడ తన నివాసానికి వచ్చారని ఫిర్యాదులో వివరించారు. అదే సమయంలో కుమారస్వామి తనకు ఫోన్‌ చేసి రూ.50 కోట్లు అడిగారని చెప్పారు. తాను నగదు ఇచ్చే స్థితిలో లేనని చెప్పడంతో కోపగించుకున్న కుమార ‘నీ ప్రాజెక్టు ఎలా పూర్తవుతుందో చూస్తాను’ అని హెచ్చరించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక దేవాలయం నిర్మాణానికి రూ.5 కోట్లు ఇవ్వాలని రమేశ్‌ గౌడ కోరినా తాను నిరాకరించానని చెప్పారు. తాను దళపతుల కోసం 2019 ఎన్నికల్లో భారీ మొత్తంలో ఖర్చు చేశానని తెలిపారు.

స్నేహమయి కృష్ణపై విచారణ



స్నేహమయి కృష్ణ

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : మైసూరు అభివృద్ధి ప్రాధికారలో జరిగిన అక్రమాల్లో భారీ మొత్తంలో నగదు చేతులు మారిందని ఆరోపించిన సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ గురువారం ఇక్కడ ఈడీ అధికారుల ముందు విచారణకు హాజరయ్యారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, బావమరిది మల్లికార్జున, అప్పటి ముడా కమిషనర్‌పై కృష్ణ పలు ఆరోపణలు చేశారు. సిద్ధరామయ్య ఆదేశాలతోనే నగదు చేతులు మారిందని సెప్టెంబరు 27న ఈడీకి ఫిర్యాదు చేశారు. దీనిపై మరిన్ని వివరాలు ఇవ్వాలని ఈడీ తాఖీదులు జారీ చేయడంతో ఆయన విచారణకు హాజరయ్యారు. తన, ఇతర కుటుంబ సభ్యుల వివరాలు, ఆస్తులు, బ్యాంకు ఖాతాల దాఖలాలు, ఆదాయ మూలాలను తెలియజేయాలని కోరడంతో 500 పుటల దాఖలాలను తీసుకువచ్చి అధికారులకు అందజేశారు. సీబీఐ దర్యాప్తునకు కేసు అప్పగించాలని ఉన్నత న్యాయస్థానంలో వేసిన కేసులో తీర్పు కూడా తనకు మద్దతుగా వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మునిరత్న చుట్టూ ఉచ్చు



మునిరత్న

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : రాజరాజేశ్వరినగర ఎమ్మెల్యే మునిరత్న రాజకీయ నాయకులపై ‘తేనెవల’ విసిరేందుకు వినియోగిస్తున్న గదులను ప్రత్యేక దర్యాప్తు దళం అధికారులు గురువారం మహజరు నిర్వహించారు. అక్కడి నుంచి కొన్ని దాఖలాలను జప్తు చేసుకున్నారు. ప్రాథమిక దర్యాప్తులో మునిరత్న నేరం రుజువైతే.. ఆయన శాసనసభ స్థానాన్ని రద్దు చేయాలని స్పీకర్‌ను కోరాలని అధికార కాంగ్రెస్‌ పార్టీ నిర్ణయించింది. ప్రభుత్వం ఏ చర్యలు తీసుకున్నా, మౌనంగానే ఉండాలని కాషాయదళం తీర్మానించింది. జేపీపార్కు సమీపంలోని గోదాము, ఎంఎస్‌ రామయ్య సమాధికి సమీపంలోని ఒక బాడుగ ఇంట్లోనూ మహజరు కొనసాగింది.

వాన తెచ్చిన ముప్పు

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో వానలు మరోసారి జోరందుకున్నాయి. మలెనాడు, కరావళి ప్రాంతాలతో పాటు రాజధాని బెంగళూరు నగరంలోనూ విడతలవారీ కుండపోత గురువారం కొనసాగింది. వానకు తోడు ఈదురు గాలులు పెను ముప్పు తెచ్చిపెడుతున్నాయి. పలు చోట్ల రహదారులు వాగుల్లా మారగా.. భారీ వృక్షాలూ నేలవాలుతున్నాయి. బెంగళూరు నాగర్నవ ప్రాంతంలో భారీ వృక్షం నేలవాలడంతో ఆగిన రాకపోకలు.. **-న్యూస్‌టుడే, బెంగళూరు**



పాకిస్థాన్‌ నుంచి చొరబాటు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : జిగణి ప్రాంతంలో ఉంటున్న మరో ముగ్గురు పాకిస్థాన్‌ వాసులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. గత సోమవారం జిగణి వద్దే నలుగురిని, దావణగెరెలో బుధవారం ఆరుగురు పాకిస్థాన్‌ జాతీయులను అరెస్టు చేయడం తెలిసిందే. వారి నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా మరో ముగ్గురిని గురువారం అరెస్టు చేశారు. మెహది ఫౌండేషన్‌ తరఫున యూనస్‌ అల్గోర్‌ ధర్మగురువు నిర్వహించిన ప్రచారం సమయంలో పదిహేను మంది పాకిస్థాన్‌ నుంచి అక్రమ మార్గాల్లో భారత్‌కు వచ్చారని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల వివరాలను పోలీసులు వెల్లడించవలసి ఉంది.

ట్రాక్టరుపై ఆటాడుతూ..

దావణగెరె, న్యూస్‌టుడే : ఇంటి ముందు నిలిపి ఉంచిన ట్రాక్టరుపై కూర్చుని ఆడుకుంటూ కిందపడిన దిశా గౌడ అనే ఆరు నెలల బాలిక తీవ్రంగా గాయపడి మరణించింది. హరప్పనహళ్లి తాలూకా జిట్టినకట్టె గ్రామంలో బుధవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పాపను ట్రాక్టరు ముందు భాగంలో కూర్చోబెట్టి ఆడిస్తూ ఆమెను విడిచిపెట్టడంతో కిందపడి గాయపడింది. తీవ్రంగా గాయపడిన బాధితురాలిని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆమె మరణించింది. హరప్పనహళ్లి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కారులో మృతదేహం

రామనగర : రాజధాని నగర శివారు బిడది పట్టణంలోని సుభాష్‌ ఆసుపత్రి సమీపంలో నిలిపి ఉంచిన కారులో అపరిచిత వ్యక్తి (40) మృతదేహాన్ని గురువారం గుర్తించారు. మృతదేహాన్ని మరణోత్తర పరీక్షలకు పంపించి బిడది ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అలా.. నిలబడే కన్నుమూత

హాసన, న్యూస్‌టుడే : సకలేశపుర తాలూకా వణగూరు సమీపంలో 20 ఏళ్ల వయసున్న ఆడ ఏనుగు నిలబడిన చోటే మరణించింది. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో అటవీ శాఖ సిబ్బంది గురువారం అక్కడకు చేరుకుని మరణోత్తర పరీక్షల అనంతరం దానికి అంత్యక్రియలు నిర్వహించారు.

‘యత్నాళ్‌ నోటికి నియంత్రణేదీ?’



విలేకరులతో మాట్లాడుతున్న హాలప్ప

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : పార్టీ రాష్ట్రాధ్యక్షుడు విజయేంద్ర, మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పను లక్ష్యంగా చేసుకుని విజయపుర ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్‌ యత్నాళ్‌ మాటలు తూలితే సహించేది లేదని భాజపా సీనియర్‌ నేత, మాజీ మంత్రి హరతాళు హాలప్ప హెచ్చరించారు. విజయేంద్ర, యడియూరప్పలను విమర్శిస్తేనే రాజకీయ లబ్ధి చేకూరుతుందని యత్నాళ్‌ భ్రమల్లో ఉన్నారని ఎద్దేవా చేశారు. పార్టీ ప్రధాన కార్యాలయం జగన్నాథ భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సిద్ధరామయ్య లాంటి మేరు నాయకుడి వెన్నులో చలిపుట్టించిన విజయేంద్రను ప్రశ్నించడం, ఆయనకు వ్యతిరేకంగా బహిరంగ ప్రకటనలు ఇవ్వడం పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడమేనని హెచ్చరించారు. పార్టీ అధిష్ఠానం నియమించిన విజయేంద్ర పిల్లవాడు ఎలా అవుతారని ప్రశ్నించారు.

‘భాజపా నేతలూ.. తప్పుకోండి’

నిత్యం నైతిక విలువలు బోధించే భాజపా నేతలు చేసిన తప్పులు అంగీకరించి పదవులకు రాజీనామా చేయాలని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి ప్రియాంక్‌ఖర్గే డిమాండ్‌ చేశారు. ఆయన గురువారం ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామా చేయాలని డిమాండ్‌ చేస్తున్న ప్రతిపక్ష నేత ఆర్‌.అశోక్‌ భూకుంభకోణం ఆరోపణలు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. నీతి పాఠాలు చెప్పే ఆయన రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు.



ఆంజనేయ స్వామికి రంగుల పాయలతో అలంకరణ

ఘనంగా దసరా ఉత్సవాలు షురూ

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: చెళ్లకెర పట్టణంలోనూ తాలూకాలోని ఇతర ప్రాంతాల్లో గురువారం దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నాడ హబ్బ అయిన దసరా సందర్భంగా వివిధ దేవాలయాలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. భక్తులు ఉదయాన్నే దేవాలయాలను సందర్శించి మొక్కులను తీర్చుకున్నారు.

పేట బసవేశ్వర ఆలయంలో పూజలు



కంప్లి పేట బసవేశ్వర ఆలయంలో వినాయక, శివమూర్తులు

కంప్లి, న్యూస్‌టుడే: దసరా నవరాత్రులను పురస్కరించుకుని స్థానిక పేట బసవేశ్వర ఆలయంలో తొలిరోజు గురువారం వినాయక, శివుడి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. కళాకారుడు పరశురామప్ప చిత్రగార వీటిని అలంకరించారు.

లారీని ఢీకొన్న కారు- ఉద్యోగి మృతి

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: హిరియూరు తాలూకా కస్తూరి రంగప్పనహళ్లి గ్రామం వద్ద బెంగళూరు-పుణె జాతీయ రహదారిలో ముందు వెళ్తున్న లారీని వెనుక వైపు నుంచి కారు ఢీకొన్న సంఘటనలో చెన్నపట్టణ తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్(50) మృతి చెందారు. ఈ సంఘటన గురువారం ఉదయం జరిగినట్లు పోలీసులు తెలిపారు. చంద్రశేఖర్ కుమారునికి దావణగెరెలోని వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు లభించడంతో ప్రవేశానికి కుటుంబ సభ్యులు కారులో వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకొందన్నారు. ప్రమాదం జరిగినప్పుడు చంద్రశేఖర్ కారును నడుపుతున్నారని తెలిపారు. గాయపడిన కుటుంబ సభ్యులను హిరియూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

బుడాలో అక్రమాలు?

లేఖ రాసిన ఎమ్మెల్యేలు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగరాభివృద్ధి ప్రాధికార (బుడా)లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారికంగా జరిగిన రెండు సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను రద్దు చేసిన పట్టణాభివృద్ధి శాఖ దీనిపై విచారణ ప్రారంభించింది. రాష్ట్రంలో ముడా ఆరోపణలు, బెంగళూరులో డీనోటిఫికేషన్‌పై రాజకీయం వేడెక్కుతున్న తరుణంలో బళ్లారి బుడాలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బుడా అధ్యక్షుడిగా జె.ఎస్. ఆంజినేయులు ఉన్నారు. ఇక్కడే అక్రమాలు జరిగినట్లు బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, కంప్లి ఎమ్మెల్యే జె.ఎన్.గణేశ్ ప్రభుత్వానికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బుడాలో నిర్ణయాలు తీసుకుంటున్న సందర్భంలో ఎమ్మెల్యేల అభిప్రాయాలు తీసుకోకుండా అధ్యక్షుడు ఆంజనేయులు వ్యవహరిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు ఫిర్యాదు నేపథ్యంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సెప్టెంబరు 26న ఆ శాఖ అధికారులకు నోట్ రాసి విచారణ చేసిన తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

నిర్ణయాలను రద్దు చేయండి

నగరాభివృద్ధి ప్రాధికార, నగర, గ్రామాంతర యోజన కమిషనర్ బళ్లారి బుడా కమిషనర్‌కు లేఖ రాసి 2024 మార్చి 7 నుంచి జులై 8వ తేదీ వరకు బుడా సామాన్య సమావేశంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వీటిని పరిశీలించాలని లేఖలో పేర్కొన్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రద్దు చేసి పరిశీలించి ఏడు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధార్వాడ విభాగం నగర, గ్రామాంతర యోజన ప్రాధికార నిర్దేశకులు బుడాలోని పత్రాలను పరిశీలించడం ప్రారంభించారు. ఈ రెండు సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన పత్రాలు పరిశీలించడానికి మరింత సమయం అవసరమని ధార్వాడ విభాగం అధికారులు ప్రభుత్వాన్ని కోరారు.



బుడా కార్యాలయం


ఎలాంటి విచారణకైనా సిద్ధం



ఎమ్మెల్యేలు నారా భరత్‌రెడ్డ, గణేశ్ పార్టీలో సీనియర్ నేతలు. బుడాలో ఏమి అక్రమాలు జరిగేయో తెలియదు. నేను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదు. సమావేశంలో నేను ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడానికి అవకాశం లేదు. సభ్యులతో చర్చించిన తర్వాతే నిర్ణయాలు తీసుకున్నాం. ఎలాంటి విచారణ చేసిన నాకు ఇబ్బంది లేదు.

- జె.ఎస్.ఆంజినేయులు, బుడా అధ్యక్షుడు

ఎలాంటి ఉద్దేశం లేదు



కంప్లి నియోజకవర్గంలోకి వచ్చే శ్రీధరగడ్డ, కప్పగల్లు గ్రామ పంచాయతీల్లో బుడా అనుమతితో కొత్త లేఅవుట్లు పుట్టుకొచ్చాయి. ఎక్కువ మంది రైతులు బుడా అనుమతి కోసం దరఖాస్తులు చేసుకున్నారు. కొంత మంది రైతులకే అనుమతులు వచ్చాయి. దీనిపై పలువురు రైతులు మా దృష్టికి తేవడంతో తమ పరిధిలోకి వచ్చే శ్రీధరగడ్డ, కప్పగల్లు గ్రామాల్లో లే అవుట్లపై నిర్ణయాలు తీసుకొనే ముందు నా దృష్టికి తీసుకోవాలని ప్రభుత్వానికి లేఖ రాశాను. **- జె.ఎన్.గణేశ్, ఎమ్మెల్యే, కంప్లి నియోజకవర్గం**

క్రీడలు దినచర్యగా చేసుకోవాలి



పరుగులో క్రీడాకారులు

బళ్లారి, న్యూస్‌టుడే: క్రీడలు జీవితంలో ఓ భాగం కావాలి. క్రీడలతో శరీరకంగానే కాకుండా మానసికంగా దృఢంగా ఉంటారని బీపీఎస్సీ పదవి పూర్వ కళాశాల అధ్యక్షుడు డా. యశవంత్ భూపాల్ సూచించారు. బళ్లారి పదవి పూర్వ శిక్షణ శాఖ, బీపీఎస్సీ పదవి పూర్వ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జిల్లా క్రీడామైదానంలో 25వ బళ్లారి జిల్లా స్థాయి పదవి పూర్వ కళాశాల క్రీడాపోటీలు-2024-25ను ఆయన ప్రారంభించారు. క్రీడాపోటీల్లో పాల్గొన్న వారు గెలుపోటములను సమానంగా తీసుకోవాలి. ఓటమి జీవితంలో ఓ పాఠం నేర్పుతుంది. గెలుపునకు బాటలు వేస్తోందన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు విభాగం, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గెలుపొంది, బళ్లారి జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. జిల్లా పదవి పూర్వ శిక్షణ శాఖ ఉప నిర్దేశకుడు టి.పాలాక్ష మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు చరవాణి, అంతర్జాలం, వీడియోగేమ్స్ వంటి వాటికే పరిమితమవుతున్నారు. వ్యాయామం, క్రీడలకు దూరం కావడంతో చిన్న వయస్సులోనే మానసిక, శరీరకంగా ఇబ్బందులు పడుతున్నారు. క్రీడలతో ఆరోగ్యం, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. బీపీఎస్సీ కళాశాల ప్రధాన ఆచార్యులు త్రిపురాంబ, జిల్లా ప్రధాన ఆచార్యుల సంఘం అధ్యక్షుడు శ్రీశైలప్ప, ప్రధాన కార్యదర్శి హెచ్.ఎస్.శివరామ్, ఉపన్యాసకుల సంఘం అధ్యక్షుడు డా.ఎం.రాజణ్ణ, మద్దికేరప్ప పాల్గొన్నారు.



క్రీడాలను ప్రారంభిస్తున్న డీడీపీయూ పాలాక్ష

ప్రజలకు వైజ్ఞానిక అవగాహన అవసరం



ఖగోళ విస్మయ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా సైన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు మల్లికార్జునప్ప

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: దేశం సర్వతోముఖాభివృద్ధికి అక్కడి ప్రజల్లో వైజ్ఞానిక విషయాలపై అవగాహన అవసరమని జిల్లా సైన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు జి.ఎన్.మల్లికార్జునప్ప పేర్కొన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా గురువారం హిరియూరులోని గిరీశ్ బీఈడీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఖగోళ విస్మయ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అంతరిక్ష పరిశోధనలను మానవుని సంక్షేమం, అభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు. ఖగోళ మార్పులను కొన్ని స్వార్థపర శక్తులు మూఢ నమ్మకాలతో ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. ప్రజలు మూఢ నమ్మకాలను విస్మరించాలన్నారు. తాలూకా విద్యాశాఖ అధికారి తిప్పేస్వామి, విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయుడు హెచ్.ఎస్.టి.స్వామి, కళాశాల ప్రధానాచార్యులు సుధ, ఫౌండేషన్ డైరెక్టర్లు రుద్రముని, నాగలింగా రెడ్డి పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజయనగర క్రీడాకారుల సత్తా

హొసపేటె, న్యూస్‌టుడే: కర్ణాటక పవర్ లిఫ్టర్స్ సంస్థ, దావణగెరె, రాక్‌ఫిట్ అల్ట్రాజిమ్ సంయుక్తాధ్వర్యంలో సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 1వరకు జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజయనగర క్రీడాకారులు సత్తాచాటారు. మొత్తం 14 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సబ్‌జూనియర్ విభాగంలో మొహ్మద్ ముజాఫర్, ఆర్.జె.మాహి, పవన్ రజపూత్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. జూనియర్ విభాగంలో ఇస్మాయిల్ జబీవుల్లా ప్రథమ, మహ్మద్ పర్వేజ్ ద్వితీయ, ఎస్.రెహాన్ తృతీయ స్థానంలో నిలిచారు. సీనియర్ విభాగంలో శ్రీధర్, సునీల్ క్రమంగా ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారు. మాస్టర్ విభాగంలో నాసీరుద్దీన్, నిజాముద్దీన్, వీరభద్రప్ప ప్రథమ స్థానంలో నిలవగా, నూర్ మహ్మద్ ద్వితీయ, హులిగేశ్ తృతీయ స్థానంలో నిలబడ్డారు. క్రీడాకారులను హొసపేటెలోని ప్లానెట్ ఫిట్‌నెస్ సంస్థ నిర్వాహకులు అభినందించారు.



దావణగెరెలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తాచాటిన విజయనగర క్రీడాకారులు

అఖండ బళ్లారి జిల్లాలో పార్టీని పటిష్ఠం చేస్తాం

హొసపేటె, న్యూస్‌టుడే: గాలి జనార్దన రెడ్డి రాకతో అఖండ బళ్లారి జిల్లాలో భారతీయ జనతాపార్టీ మరింత బలపడింది. మాజీ మంత్రి ఆనంద్ సింగ్, గాలి జనార్దనరెడ్డితో కలిసి రెండు జిల్లాల్లో పార్టీని బలోపేతం చేస్తామని మాజీ మంత్రి బి.శ్రీరాములు పేర్కొన్నారు. హొసపేటెలో గురువారం స్థానిక నటుడు తాయప్ప అభినయిస్తున్న జోగి సినిమా చిత్రీకరణ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తను, జనార్దనరెడ్డి మంచి స్నేహితులం, ఒకప్పుడు బళ్లారిలో పార్టీవైభవంగా ఉండటానికి తీవ్రంగా కృషి చేశాం. అలాంటి వాతావరణం మళ్లీ కలిసి వచ్చింది, దానిని సద్వినియోగం చేసుకుంటామని స్పష్టం చేశారు. 2028లో వచ్చే విధానసభ ఎన్నికల్లో ముగ్గురూ కలిసి అఖండ బళ్లారి జిల్లాలో సత్తాచాటుతామని తేల్చిచెప్పారు. ఈ ప్రభుత్వానికి దాదాపు ఆయువు మూడింది, ఇక ఎన్నిరోజులు ఉంటుందో చెప్పలేమని మాజీ మంత్రి శ్రీరాములు ఎద్దేవాచేశారు. ఏడాది తిరగకముందే ఈ ప్రభుత్వం పెద్దలు, మంత్రులు తమ విశ్వరూపం చూపారు. అవినీతిలో కూరుకుపోయారని ధ్వజమెత్తారు. ప్రజాధనంపై కన్నేసి నేడు జైల్లో ఊచలు లెక్కిస్తున్నారని దుయ్యబట్టారు. ముడా ఇచ్చిన స్థలాలను తిరిగి ఇచ్చినా సీఎంపై పడిన అవినీతి మరక తుడిచిపోదని ఓ ప్రశ్నకు సమాధానం చెప్పారు.



స్థానిక నటుడు తాయప్ప నటించిన జోగి సినిమా చిత్రీకరణ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి బి.శ్రీరాములు

తుంగా హారతితో సింధనూరు దసరాకు అంకురార్పణ



గాంధీనగర్ శివాలయం వద్ద కాలువలో తుంగభద్రకు హారతి ఇస్తున్న బాదర్లి, నాడగౌడ, కె.విరుపాక్షప్ప, అధికారులు



భక్తితో తిలకిస్తున్న జనం

గాంధీనగర్ (సింధనూరు), న్యూస్‌టుడే: గాంధీనగర్ శివాలయం ఎదురుగా ఉన్న తుంగభద్ర కాలువలో గురువారం సాయంత్రం సందడి నెలకొంది. తొమ్మిది రోజులపాటు ఆచరించనున్న సింధనూరు దసరా ఉత్సవాలకు తుంగా హారతితో అంకురార్పణ జరిగింది. గాంధీనగర్‌తో పాటూ చుట్టుపక్కల అనేక ప్రాంతాల ప్రజలు ఈ వేడుక తిలకించడానికి విచ్చేశారు. అర్చకస్వాములు పవిత్ర గంగకు పూజలు చేసి హారతి పట్టారు. ఎమ్మెల్యే బాదర్లి, మాజీ మంత్రి నాడగౌడ, మాజీ ఎంపీ కె.విరుపాక్షప్ప, తహసీల్దారు, నగర కమిషనర్, గాంధీనగర్ పంచాయతి మాజీ అధ్యక్షుడు గోపినీడి కృష్ణ, శివాలయ క్షేత్రం అభివృద్ధి సమితి అధ్యక్షుడు ముళ్లపూడి భాస్కరరావు పాల్గొన్నారు.

అసోం నుంచి హుబ్బళ్లికి 5న ఏకముఖ రైలు సంచారం

హొసపేటె, న్యూస్‌టుడే: అసోం రాష్ట్రం దిబ్రూగడ్ నుంచి హుబ్బళ్లికి ఏకముఖ రైలు సంచారాన్ని 5న ప్రారంభిస్తున్నట్లు నైరుతి రైల్వే హుబ్బళ్లి విభాగం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. దసరా పండగ నేపథ్యంలో ఈ రైలును నడుపుతున్నారు. 5న దిబ్రూగడ్ నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు బయల్దేరే ఈ రైలు (సంఖ్య: 07359) 8న ఉదయం 9 గంటలకు హుబ్బళ్లి చేరుకుంటుంది. మహర్కటియ, మరియాని, గువాహటి, రాంపుర్‌హట్, కటక్, భువనేశ్వర్, బెరహంపూర్, పలాస, శ్రీకాకుళం, విజయనగరం, సింహాచలం, దువ్వాడ, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నంద్యాల, గుంతకల్లు, బళ్లారి, హొసపేటె గుండా హుబ్బళ్లి చేరుకుంటుంది. ఈ రైల్లో పది స్లీపర్‌క్లాస్, రెండు సాధారణ బోగీలు ఉంటాయని ఒక ప్రకటనలో తెలిపారు.

'హంపీ' వీసీకి సోదే సదాశివరాయ పురస్కారం

హొసపేటె, న్యూస్‌టుడే: ఉత్తర కన్నడ సోదె రాజవంశజులు ఏటా ప్రముఖ విద్వాంసులకు మహారాజు సోదె సదాశివరాయ పేరిట ప్రదానం చేసే పురస్కారానికి హంపీ కన్నడ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ డి.వి.పరమశివమూర్తి ఎంపికయ్యారు. ఈ నెల 19, 20 తేదీల్లో ఉత్తర కన్నడ జిల్లా శిరసీలో ఏర్పాటు చేసిన సోందా చరిత్రోత్సవం, రాష్ట్రస్థాయి చరిత్ర సమ్మేళనంలో ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేస్తున్నారు. చరిత్ర విభాగంలో పలు పరిశోధనలు చేసి, అరుదైన పుస్తకాలు కానుకగా ఇచ్చినందుకు ఆయన్ను ఈ పురస్కారానికి ఎంపికచేశారు. శిరసీలోని స్వాది జైనమంఠంలో జరిగే కార్యక్రమంలో వీసీ పురస్కారం అందుకుంటున్నారు. పురస్కారం కింద రూ.10వేల నగదు, జ్ఞాపిక, సోదె రాజుల పేట ప్రదానం చేస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు.



డాక్టర్ డి.వి.పరమశివమూర్తి, హంపీ వర్సిటీ ఉపకులపతి

వాల్మీకి జయంతి ఏర్పాట్లపై సమీక్ష

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహించే మహర్షి వాల్మీకి జయంతిని ఆర్భాటంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకోవాలని అదనపు జిల్లా పాలనాధికారి మహమ్మద్ ఝుభేర అధికారులకు సూచించారు. డా.రాజ్‌కుమార్ రహదారిలో ఉన్న నూతన జిల్లా పాలనాధికారి కార్యాలయం సభా భవనంలో గురువారం ఏర్పాటు చేసిన వాల్మీకి జయంతి నిర్వహణ సమీక్ష సమావేశాన్ని ఏడీసీ ప్రారంభించి మాట్లాడారు. 17న ఉదయం 9 గంటలకు స్థానిక వాల్మీకి కూడలి వద్ద మహర్షి విగ్రహానికి పూలమాల వేసి అక్కడ నుంచి వాల్మీకి చిత్రపటం ఊరేగింపు ప్రారంభమవుతుందన్నారు. ఊరేగింపు కొనసాగే ప్రదేశాల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ట్రాఫిక్ నియంత్రణ లేకుంటే వాహనాలను మళ్లించాలని పోలీస్ అధికారులకు సూచించారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు, వాల్మీకి సంఘం తదితరులు పాల్గొని వాల్మీకి జయంతిని విజయవంతం చేయాలని కోరారు. పదో తరగతి వార్షిక పరీక్షలు, ద్వితీయ పీయూసీ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు పీహెచ్‌డీ పూర్తి చేసిన వాల్మీకి వర్గం విద్యార్థులను వేదికపై సన్మానం చేయడానికి జాబితాను సిద్ధం చేయాలని గిరిజన సంక్షేమశాఖాధికారి దివాకర్‌కు సూచించారు. విశేష ఉపన్యాసం ఉండే విధంగా చూడాలి. ఏసీ ప్రమోద్‌కుమార్, నగర డీఎస్పీ చంద్రకాంత నందరెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి దివాకర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీసీ మహమ్మద్ ఝుభేర, చిత్రంలో ఏసీ ప్రమోద్‌కుమార్, డీఎస్పీ చంద్రకాంత నందరెడ్డి

సకాలంలో పక్కా గృహాల నిర్మాణం

అధికారులకు మంత్రి ఆదేశం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర శివారు ప్రాంతమైన ముండరిగిలో కొత్తగా నిర్మించిన మహాత్మాగాంధీ టౌన్‌షిప్‌లో ఇప్పటికే పూర్తయిన 820 పక్కా గృహాలను లబ్ధిదారులకు ఈ ఏడాది చివరిలో వితరణ చేయడానికి సిద్ధం చేసుకోవాలని జిల్లా బాధ్య మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ అధికారులకు సూచించారు. గురువారం బెంగళూరులో మంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి పాల్గొని మహాత్మాగాంధీ టౌన్‌షిప్‌లో జరుగుతున్న పక్కా గృహాలు నిర్మాణంపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశానికి హాజరైన జిల్లా పంచాయతీ ముఖ్య అధికారి రాహుల్ శరణప్ప సంకనూర, నగర పాలికె కమిషనర్ ఖలీల్‌సాబ్ పక్కా గృహాల నిర్మాణంపై చర్చించారు. 820 ఇళ్లలో పెండింగ్‌లో ఉన్న గృహాలను నిర్దిష్ట సమయంలోపు పూర్తి చేసి ఈ ఏడాది చివరి లోపు పంపిణీకి సిద్ధం చేస్తామని అధికారులు మంత్రి, ఎమ్మెల్యేలకు సూచించారు. ఈ నెలలోపే పక్కా గృహాలు పూర్తి చేసి తమకు చూపించాలి. అనంతరం మంత్రితో చర్చించి లబ్ధిదారులకు అందజేసే తేదీలను ప్రకటిస్తామన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్, చిత్రంలో ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

దర్శన్‌ను కలిసిన భార్య, కుమారుడు



దర్శన్‌ను కలిసి బయటకు వస్తున్న భార్య విజయలక్ష్మి, కుమారుడు వినీశ్

బళ్లారి: చిత్రదుర్గం వాసి రేణుకాస్వామి హత్య కేసులో నిందితుడైన సినీ నటుడు దర్శన్‌ను కుమారుడు వినీశ్ మొదటిసారిగా బళ్లారి కేంద్ర కారాగారంలో గురువారం సాయంత్రం కలిశారు. కుమారుడితో పాటు సతీమణి విజయలక్ష్మి ఉన్నారు. తమ భర్త దర్శన్‌ను కారాగారంలో కలవడానికి ఎక్కువ సమయం ఇవ్వాలని విజయలక్ష్మి, కుమారుడు వినీశ్ వేర్వేరుగా దరఖాస్తులను జైలు అధికారులకు ఇచ్చారు. అధికారులు 40 నిమిషాల పాటు సమయం ఇచ్చారు. బెంగళూరు నుంచి ప్రత్యేక వాహనంలో సాయంత్రం 4 గంటలకు భార్య, కుమారుడు ఇక్కడికి చేరుకున్నారు. బెంగళూరు తీసుకుని వచ్చిన రెండు సంచులను జైలు లోపలికి తీసుకెళ్లారు. బెయిల్ విషయంపై భార్య, కుమారుడితో సుదీర్ఘంగా చర్చించినట్లు అధికారులు తెలిపారు. రెండు నెలలు తర్వాత కుమారుడు వినీశ్‌ను చూడగానే దర్శన్ భావోద్వేగానికి గురయ్యారు. తండ్రిని చూడగానే వినీశ్ కళ్లలో నీళ్లు తిరిగాయని అధికారులు తెలిపారు. దర్శన్ వెన్నునొప్పితో బాధపడుతుండటంతో బీఎంసీఆర్‌సీ వైద్యులు దర్శన్‌కు పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్స చేసుకోవాలని సలహా ఇచ్చినట్లు జైలు అధికారులు తెలిపారు.

జగన్మాథ...శైలపుత్రి



ఏళుమక్కళతాయి ఆలయం వద్ద కుంభోత్సవంలో పాల్గొన్న భక్తులు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: దసరాశరన్నవరాత్రుల్లో భాగంగా జగన్మాథ..దుర్గాదేవిని ఆరాధించటం ఆనవాయితీ..తొలిరోజు అమ్మవారిని శైలపుత్రి (బాలత్రిపురసుందరి)గా కొలిచారు. నగరంలో అమ్మవారు పలురూపాల్లో దర్శనమిచ్చారు. విద్యానగర్ దుర్గాదేవి, చిన్నదుర్గమ్మకు బాలత్రిపురసుందరిగా, సంతోషిమాత, ఏళుమక్కళతాయి దుర్గాదేవిగా, రేణుకాయల్లమ్మ రాజరాజేశ్వరీమాతగా, భవానిమాతకు ఆకులతోనూ, తాయమ్మకు పుష్పాలతోనూ అలంకరించి పూజించారు. చిన్నమార్కెట్ హులిగెమ్మ దేవస్థానం వద్ద కార్పొరేటర్ గోవిందరాజులు భక్తులకు అన్నదానం చేశారు.

దేవిక్యాంపు (కారటగి): సమీప దేవిక్యాంపు రత్నగిరిపై గురువారం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీదేవి అమ్మవారు బాలా త్రిపురసుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నవనగర్‌లోని కమ్మవారి శిక్షణ సంస్థ రెడ్డి వీరణ్ణ సంజీవప్ప వసతి పాఠశాలలో శారదామాతకు విశేష పూజలు జరిగాయి.

● **శ్రీరామనగర్‌లో:** శ్రీరామనగర్ ప్రజల ఆరాధ్య దైవం కనక దుర్గాదేవి ఆలయంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు.

సింధనూరు: సింధనూరు పట్టణం, క్యాంపులు, గ్రామాల్లో దసరా నవరాత్రుల వేడుకలు ఘనంగా ఆరంభమయ్యాయి. అమ్మవారి విగ్రహాలను భక్తులు ఊరేగింపుగా తీసుకొచ్చి మంటపాల్లో ప్రతిష్ఠించారు.

గంగావతి: ఆనెగుంది మేగోటపై శరన్నవరాత్రులు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఘటస్థాపన, కలశారోహణం గోపూజతో ధార్మిక కార్యాలు ప్రారంభమయ్యాయి. పీఠాధిపతి బ్రహ్మానందస్వామి నేతృత్వంలో నవచండి హోమం జరిగింది. రాజవంశీకులు లలితారాణి శ్రీరంగదేవరాయలు, శ్రీకృష్ణదేవరాయలు దంపతులు పాల్గొన్నారు.

సిరుగుప్ప: శరన్నవరాత్రి ఉత్సవాలు తాలూకా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో ఆచరిస్తున్నారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలు, తెలుగు క్యాంపుల్లో గురువారం అమ్మవారి ఆలయాల్లో ఉదయాన్నే అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.



బళ్లారి: విద్యానగర్ దుర్గాదేవికి బాలత్రిపురసుందరి అలంకరణ



బళ్లారి : సంతోషిమాతకు దుర్గాదేవి అలంకరణ



చిన్నదుర్గమ్మ తల్లికి త్రిపురసుందరి అలంకరణ



కారటగి: దేవిక్యాంపు రత్నగిరిపై బాలాత్రిపుర సుందరి దేవిగా శ్రీదేవి



కారటగి: సాలుంచిమర క్యాంపులో మారెమ్మ దేవి



శ్రీరామనగర్ ఆర్ వార్డులోని సంతోషి మాత



సింధనూరు గాంధీనగర్‌లో..



సింధనూరు ఈజే. హొసళ్లిక్యాంపులో..



సింధనూరు రామకోరోల్ కాలనీ వరసిద్ది ఆలయంలో..



గంగావతి గ్రామదేవత దుర్గమ్మ



సిరుగుప్ప శ్రీనగర్ క్యాంపులో స్వర్ణకవచాలంకృత దుర్గాదేవి

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు

అభ్యంతరాలకు అవకాశం

బళ్లారి, న్యూస్‌టుడే: నగర పాలికె వ్యాప్తిలో వివిధ ప్రాంతాల్లో కూడళ్లు, రహదారులకు నామకరణం, విగ్రహాలు ప్రతిష్ఠాపన చేయడానికి పాలికె సమావేశంలో తీర్మానం చేశారు. దీనిపై ప్రజల నుంచి అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా ఇవ్వాలని కోరారు. బళ్లారి నగరం గాంధీనగర బాలభారతి రహదారికి హేమాద్రి భట్ రహదారిగా నామకరణం, ఇన్‌ఫ్యాంటరీ రహదారిలోని వాసవి పాఠశాల ముందు కూడలికి సిద్ధరామేశ్వరి, విగ్రహ ప్రతిష్ఠ, కాళమ్మ వీధి ప్రారంభంలోని పశుసంవర్ధక ముందు పార్క్ ఉన్న ప్రాంతానికి విశ్వకర్మ అమర శిల్పి జక్కణాచారి కూడలిగా, మోకా రహదారిలోని కేఈబీ కూడలికి విశ్వగురు బసవేశ్వర కూడలిగా నామకరణం చేశాం. బసవేశ్వర విగ్రహ ప్రతిష్ఠ, అల్లం భవనం కూడలికి గంగమ్మ తాయి కూడలిగా నామకరణం, విగ్రహ ప్రతిష్ఠించాలని తీర్మానం చేశారు.

హైటెక్ మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ

కంప్లి, న్యూస్‌టుడే: తాలూకాలోని 10.ముద్దాపుర, రామసాగర, దేవసముద్ర గ్రామాల్లో అయిదు హైటెక్ మరుగుదొడ్ల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే గణేశ్ గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, బడుగువర్గాల సౌకర్యార్థం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు హైటెక్ మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. నియోజకవర్గానికి 19 మరుగుదొడ్లు మంజూరవగా 11 కంప్లి తాలూకాలో నిర్మిస్తామన్నారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.25 లక్షలు వ్యయం కానుంది. ఇళ్లు లేని వారికి త్వరలో కేటాయిస్తామన్నారు. కంప్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.శ్రీనివాస రావు, షణ్ముకప్ప, బి.నారాయణప్ప, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

6న ఐఏఎస్, కేఏఎస్ శిక్షణకు ఎంపిక పరీక్ష

బళ్లారి, న్యూస్‌టుడే: అల్పసంఖ్యాక కల్యాణ శాఖ ఆధ్వర్యంలో ఐఏఎస్, కేఏఎస్ పోటీ పరీక్షల శిక్షణకు ముందు అభ్యర్థులకు ఎంపికకు సామాన్య పరీక్ష ఈ నెల 6న నిర్వహిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థులు సేవాసింధు పోర్టల్లో ప్రవేశపత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష 6 స్థానిక హొసపేటె రహదారిలోని బీఐటీఎం కళాశాల సమీపంలోని డా.ఎ.పి.జె.అబ్దుల్‌కలాం వసతి శాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగరం గాంధీనగర్ నివాసి సరోజ(56) అనే మహిళ అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన సరోజ తిరిగి రాలేదు. పలు చోట్ల గాలించిన ఆచూకీ తెలియరాలేదు. వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం

బళ్లారి: గాంధీ పోలీస్ స్టేషన్ వ్యాప్తిలోని దుర్గమ్మ దేవస్థానం ముందు ప్రధాన ద్వారం వద్ద నడకదారిపై మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి(60) మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని బీఎంసీఆర్‌సీ శవాగారానికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. సంబంధికులు ఉంటే పోలీసులను సంప్రదించాలన్నారు.

టమాటా, బీన్స్ ధరలకు రెక్కలు



తోపుడు బండ్లపై టమాటా

బళ్లారి, న్యూస్‌టుడే: రెండు నెలల కిందట ధరలు లేక రోడ్డుపై, పశువులకు పడేసిన టమోటా ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. టోకు మార్కెట్లో నాణ్యమైన టమాటా కిలో రూ.50 నుంచి రూ.60 ధర పలుకుతుండగా, తోపుడు బండ్లు, చిల్లర దుకాణాల్లో కిలోపై అదనంగా రూ.10 నుంచి రూ.20లు ఎక్కువగా విక్రయిస్తున్నారు. బీన్స్ ధరలకూ రెక్కలొచ్చాయి. గురువారం టోకు మార్కెట్లోనే కిలో రూ.100 నుంచి రూ.120లకు విక్రయించడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌కు నిత్యం కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ, ఆలూరు, ఆదోని ప్రాంతాల నుంచే రైతులు టమాటా బుట్టలు తెస్తారు. రెండు నెలల ముందు టమాటా ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతులు పూర్తిగా తీసివేసి వేరే పంటలు సాగు చేయడంతో బళ్లారికి నిత్యం వచ్చే సరకులో సగం కూడా రావడం లేదు. నాణ్యమైన టమాటా లభించడం లేదు. నల్లమచ్చ ఉన్న కాయలు ఎక్కువగా వస్తున్నా ధరలు తగ్గడం లేదు. గురువారం 24 కిలోల పెట్టె రూ.800 నుంచి రూ.1200 ధర పలికింది. ఉల్లి ధర వింటేనే కళ్లలో నీళ్లు తిరుగుతాయి. నాణ్యమైన పుణె ఉల్లి కిలో రూ.60పైనే ఉంది. రెండు నెలల కిందట పచ్చిమిరప కిలో రూ.50 నుంచి రూ.60లు ఉండేది. తుంగభద్ర జలాశయం, బోరుబావుల కింద ముందుగానే నాట్లు వేసిన రైతులకు పచ్చి మిరప దిగుబడి చేతికందడంతో ధరలు అమాంతంగా తగ్గుముఖం పట్టాయి. టోకు మార్కెట్లో కిలో రూ.10 నుంచి రూ.15లు మాత్రమే పలుకుతున్నాయి. రైతులకు కూలి, రవాణా ఖర్చులు రావడం కష్టమైంది. క్యారెట్, కాకర, ధర కిలో రూ.35 నుంచి రూ.40లు ఉన్నాయి. వేర్వేరు కూరగాయల ధరలు రూ.20 నుంచి రూ.30లు మధ్య ఉన్నాయి.



తగ్గిన మిరప

సామాన్యులకు కష్టమే



టమోటా ధర పెరగడంతో సామాన్యులు కొనుగోలు చేయడం కష్టంగా మారింది. గతంలో కిలో రూ.10లు ఉంటే నేడు రూ.50లకు చేరుకున్నాయి. వేర్వేరు కూరగాయలు ధరలు ఎక్కువగా ఉన్నాయి. టమోటాకు బదులుగా చింతపండు, నిమ్మకాయలు ఉపయోగిస్తున్నాం. ఉల్లి ధర ఐదు నెలల నుంచి తగ్గడం లేదు.

-భగీరథీ, శ్రీరాంపురం, బళ్లారి

హోటళ్లకు ఇబ్బందిగా ఉంది



పెరిగిన కూరగాయల ధరలతో హోటళ్లను నిర్వహించడం కష్టమైంది. ప్రతి కూరనూ టమాటా లేకుండా చేయడం కష్టమే..నాణ్యత లేని టమాటా కిలో రూ.40పైనే ఉంది. క్యారెట్ ఉల్లి, కాకరకాయ ముల్లంగి, బీన్స్, బీర, వంకాయ తదితర కూరగాయల ధరలు పెరిగాయి. హోటళ్లను నిర్వహించడం కష్టంగా ఉంది.- **కళావతి, మిల్లర్‌పేటె, బళ్లారి**

ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకోండి

సిరుగుప్ప, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం కింద రైతులు, సామాన్యులకు ప్రభుత్వం అందిస్తున్న పనులను సద్వినియోగం చేసుకోవాలని పథకం నోడల్ అధికారి మనోహర్ పిలుపునిచ్చారు. కరూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం వివిధ గ్రామ పంచాయతీల పరిధిలో పశువులు, కోళ్లు, గొర్రెల షెడ్ల నిర్మాణం, సేంద్రియ ఎరువుల తయారీ గుంటలు, కాలువల నిర్మాణం, వ్యవసాయ భూముల్లో కృషి హోండా నిర్మాణం, ఉద్యానవన పంటల్లో వివిధ పనులకు ఉపాధి పథకం కింద ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నామని చెప్పారు. పథకాలు మంజూరైన వారికి ప్రమాణ పత్రాలు అందించారు. పంచాయతీ సభ్యులు, పంచాయతీ అభివృద్ధి అధికారి శివప్ప, అందించారు.

మద్యవిమోచన శిబిరాలకు శ్రీకారం



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: మద్యవిముక్తి శిబిరాలను విజయవంతం చేసి అనేక కుటుంబాలకు తోడ్పాటు అందించాలని తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు ఎం.గోపాలరెడ్డి పేర్కొన్నారు. ధర్మస్థల గ్రామీణ అభివృద్ధి సంస్థ, జనజాగృతి వేదిక, మద్యపాన సంయమ మండలి, స్థానిక సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో మద్యపానానికి బానిసలైన వారిని విముక్తి కల్పించేందుకు ముందస్తు సమావేశాన్ని గురువారం శివపార్వతి కల్యాణ మండపంలో నిర్వహించారు. ఇతర అతిథులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలను అందరూ కలిసి కట్టుగా కృషి చేసి మద్యానికి బానిసలైన వారిని విముక్తి కల్పించేందుకు దోహదపడాలన్నారు. సంస్థల ప్రతినిధులు శివశంకర రెడ్డి, శ్రీనివాస రావు, ముత్తాలయ్య శెట్టి, ఆర్.నాగరాజు, కోటిరెడ్డి, ధర్మస్థల గ్రామీణ అభివృద్ధి సంస్థ జిల్లా నిర్దేశకుడు రోహితాక్ష, తాలూకా యోజనాధికారి సుధీర్ పాల్గొన్నారు.

సింధనూరు బంద్ విజయవంతం



బస్సులు లేక బోసిగా సింధనూరు ప్రయాణ ప్రాంగణం



సమ్మె శిబిరంలో బాసటగా కూర్చున్న నాయకులు

సింధనూరు, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ ఉప వర్గీకరణ అమలు చేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కించకుండా, ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరుతూ ఐక్య పోరాట సమితి జరిపిన గురువారం సింధనూరు బంద్ విజయవంతమైంది. బంద్ కారణంగా స్థానిక బస్టాండు నుంచే కాకుండా బయటి నుంచీ ఒక్క బస్సు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బంద్‌కు పిలుపునిచ్చిన పోరాట ప్రతినిధులు ప్రధాన రహదారుల్లోనే కాక చిన్నపాటి వీధి దుకాణాలూ మూయించారు. తొలుత పీడబ్ల్యూడీ క్యాంపు అంబేడ్కర్ కూడలి నుంచి పట్టణం అంతటా భారీ బైకు ర్యాలీ జరిపిన కార్యకర్తలు..అనంతరం పెద్దఎత్తున నిరసన ప్రదర్శన చేశారు. ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ, మాజీ మంత్రి నాడగౌడ, మాజీ ఎంపీ కె.విరుపాక్షప్ప తదితరులు నిరసన శిబిరంలో కూర్చుని పోరాటానికి మద్దతు తెలిపారు.

మాన్వి: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం వివిధ దళిత సంఘాల ఆధ్వర్యంలో మాన్వి, సిరివార తాలూకాల్లో బంద్ పాటించారు. ఆందోళనకారులు ప్రముఖ కూడళ్ల వద్ద టైర్లను కాల్చి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ అబ్దుల్‌వాహిద్‌కు వినతి పత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్, బాలస్వామి కొడ్లి, అక్బర్‌సాబ్, యల్లప్ప బాదరదిన్ని, బసవరాజ్ నక్కుంది, తాయప్ప, దేవరాజ్, ప్రభురాజ్, రవికుమార్, పరమేష్, హనుమేష్, నరసప్ప పాల్గొన్నారు.



మాన్వి:టైర్లు కాల్చి నిరసన తెలుపుతున్న ఆందోళనకారులు

చేయని తప్పునకు జైలుకు పంపారు

గాలి జనార్దన్‌రెడ్డి నగరానికి రాక



ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న అభిమానులు, కార్యకర్తలు

బళ్లారి, న్యూస్‌టుడే: 'సిద్ధరామయ్య నాపై తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెట్టారు. 14 ఏళ్లపాటు నన్ను స్వగ్రామైన బళ్లారి నుంచి దూరంగా ఉంచారు. కర్మ ఎవరినీ విడిచిపెట్టదు. ఆయన స్వగ్రామం విడిచే కాలం వచ్చిందని' మాజీ మంత్రి, ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. గనుల అక్రమ తవ్వకాల కేసులో జిల్లాకు దూరంగా ఉన్న గాలి జనార్దన్‌రెడ్డి పై కోర్టు నిబంధన ఎత్తివేయడంతో గురువారం తొలిసారిగా బళ్లారికి వచ్చారు. నగర శివారు ప్రాంతమైన హొసపేటె రహదారిలోని మహదేవ మఠం వద్ద అభిమానులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. అక్కడే తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. బళ్లారిలో ఉండేందుకు కోర్టు అనుమతించింది. నేను హెలికాప్టర్‌ను ఉపయోగించాను. ప్రజల మధ్య ఉండే వాణ్ని, నన్ను విలన్‌గా సృష్టించారు. ఇప్పుడు వారు ఏమి చేస్తున్నారో అందరికీ తెలుసు. కర్మ ఎవరినీ విడిచిపెట్టదు. నేను స్వగ్రామానికి వచ్చా. వారు స్వగ్రామం విడిచి వెళ్లే పరిస్థితి వచ్చిందన్నారు. బళ్లారిని అభివృద్ధి చేయాలన్న నా కలను తుడిచివేయడానికి ప్రయత్నాలు చేశారు. సీఎం సిద్ధరామయ్య కర్మఫలాలు అనుభవిస్తున్నారని ఆరోపించారు. జిల్లా శాపం నుంచి తప్పించుకోలేరని, కనక దుర్గమ్మ చూస్తోందన్నారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో నిధులను దుర్వినియోగం చేశారు. దీని వెనక కాంగ్రెస్ పార్టీ నేతల హస్తం ఉంది. నాగేంద్ర ఒక్కరినే బలిపశువు చేశారు. ఒక్కరే ఈ అవినీతికి పాల్పడలేదు. ఎంపీ తుకారామ్‌పైనా అనర్హత వేటు వేయాలన్నారు. మేం అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు చేసిన సిద్ధరామయ్య అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. భాజపాకు పూర్వ వైభవం తెస్తామన్నారు. బళ్లారి జిల్లా అంటేనే హంపీ అని, కొందరు స్వార్థ రాజకీయాల కోసం జిల్లాను రెండు ముక్కలు చేశారన్నారు. ప్రస్తుతం వారు వనవాసం అనుభవిస్తున్నారని పరోక్షంగా ఆనంద్‌సింగ్‌పై ఆక్రోశం వ్యక్తం చేశారు. సండూరు ఉప ఎన్నికల్లో ప్రతి కార్యకర్తను కలుస్తాం. భాజపా అభ్యర్థిని గెలిపించడానికి సాయిశక్తుల శ్రమిస్తామన్నారు. దుర్గమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజల అనంతరం నివాసానికి చేరుకున్నారు.



ఊరేగింపుగా వెళ్తున్న గాలి జనార్దన్‌రెడ్డి

పట్టణ ప్రణాళికా సంఘం అధ్యక్షుడిగా ఇలియాస్ ఖాద్రి

గంగావతి,న్యూస్‌టుడే: గంగావతి పట్టణ ప్రణాళికా సంఘం అధ్యక్షుడిగా ప్రభుత్వం ఇలియాస్ ఖాద్రిని నియమించింది. సభ్యులుగా మంజునాథ్ కలాల్, గాయత్రి హంచనాళ, రహమతమలీ సంపంగిని నియమించారు. నూతన అధ్యక్షుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కాంగ్రెస్ నేతలు వారిని సత్కరించారు. ప్రముఖులు యమనప్ప విఠలాపుర, సన్నక్కి నీలప్ప, ఎస్.బి.ఖాద్రి, ఆయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.



ఇలియాస్ ఖాద్రిని సత్కరిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

మాజీ మంత్రి ఆనంద్‌సింగ్ పుట్టినరోజు ఆచరణ



హంపీ విరుపాక్ష ఆలయంలో భక్తులకు అన్నసంతర్పణ చేస్తున్న పర్యాటక మార్గదర్శుల సంఘం సభ్యులు

హొసపేటె, న్యూస్‌టుడే: మాజీ మంత్రి ఆనంద్‌సింగ్ పుట్టిన రోజు నేపథ్యంలో గురువారం హంపీలో పర్యాటక మార్గదర్శుల సంఘం నుంచి భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హంపీ విరుపాక్షి మాట్లాడుతూ..నేడు రాష్ట్రంలోని పర్యాటక మార్గదర్శులు ప్రతి నెల రూ.5వేలు గౌరవభృతి తీసుకుంటున్నారంటే అది మాజీ మంత్రి ఆనంద్‌సింగ్ చేసిన కృషి అని కొనియాడారు. విజయనగర జిల్లా, మండల, యువమోర్చా నుంచి కార్యకర్తలు హొసపేటెలోని వందపడకల ప్రజాసుపత్రి, 60 పడకల మాతా,శిశు ఆసుపత్రిలో రోగులకు పండ్లు,పాలు పంపిణీ చేశారు. ప్రముఖులు సిద్ధార్థసింగ్, శంకర్‌మేటి తదితరులు పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో సహకార శాఖ మంత్రి పర్యటన

హొసపేటె: రాష్ట్ర సహకార శాఖ మంత్రి కె.ఎన్.రాజణ్ణ 5, 6 తేదీల్లో హొసపేటె తాలూకాలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. 4న సాయంత్రం హొసపేటె వచ్చి బస చేస్తారు. 5న బళ్లారి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిశీలన, 12.30 గంటలకు బ్యాంకు ఆవరణలో రైతుల సంక్షేమాభివృద్ధి సంస్థ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.

అంగన్‌వాడీల ప్రగతికి సహకారం అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న తాలూకా శిశు అభివృద్ధి పథకం అధికారిణి సింధు ఎలిగార్

హొసపేటె, న్యూస్‌టుడే: అంగన్‌వాడీల అభివృద్ధిలో సముదాయ సహభాగిత్వం చాలా అవసరమని హొసపేటె తాలూకా శిశు అభివృద్ధి అధికారిణి సింధు ఎలిగార్ పేర్కొన్నారు. గురువారం తాలూకా పరిధి హొసూరులో అంగన్‌వాడీల వైపు సముదాయం నడక అనే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమగ్ర శిశు అభివృద్ధి పథకాన్ని బలోపేతం చేయటానికి సముదాయ సహకారం కావాలని ఆమె కోరారు. మీ పరిధిలోని అంగన్‌వాడీల్లో తరచూ పరిశీలన చేయాలి. ఏవైనా లోపాలు కనిపిస్తే వెంటనే సంబంధిత తాలూకా అధికారి దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. హొసూరు గ్రామ పంచాయతీ సభ్యుడు సణ్ణక్కి లక్ష్మణ రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు టీవీలను వితరణ చేశారు. పంచాయతీ అధ్యక్షురాలు కిచిడి జయపద్మ, కేంద్రాల పర్యవేక్షకురాలు ఎల్.డి.నదాఫ్ తదితరులు పాల్గొన్నారు.

గుండె జబ్బులపై నిర్లక్ష్యం వద్దు

బళ్లారి, న్యూస్‌టుడే: గుండె సంబంధిత వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు. వైద్యుల సలహాలతో చికిత్స పొందాలని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖాధికారి డాక్టర్ యల్లా రమేష్‌బాబు సూచించారు. జిల్లా యంత్రాంగం, పంచాయతీ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, కౌల్‌బజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గుండెపోటు రావడం ఒక భయంకరమైన అనుభవం.. ఇది ప్రాణాపాయం. రోజువారీ ఒత్తిడితో కూడిన జీవనశైలిలో మార్పుతో పాటు మానసిక ఒత్తిడిని సక్రమంగా నిర్వహించడంతో క్రమం తప్పకుండా వ్యాయామానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కుటుంబ సభ్యులకు గుండె సంబంధిత వ్యాధులు ఉండటం, అధిక రక్తపోటు, మధుమేహం, నిరంతరం ధూమపానం, అధిక స్థూలకాయం, అమితమైన వినియోగం, అధిక కొవ్వు ఉంటే గుండె జబ్బులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నిత్యం 30 నిమిషాల సాధారణ వ్యాయామం, తక్కువ కొవ్వు ఆహారం తీసుకోవడం, ధ్యానం చేయాలన్నారు. ఎప్పుడూ ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటే వ్యాధికి దూరంగా ఉండవచ్చని తెలిపారు. డా.మరియంబీ మాట్లాడుతూ వృద్ధులు గుండె జబ్బులతో పాటు, నేత్రపరీక్షలు, చెవుడు, అధిక రక్తపోటు, మధుమేహం, తదితర పరీక్షలు చేయించుకోవడం మంచిది అన్నారు. ఉప మేయర్ డి.సుకుం పాల్గొన్నారు. కౌల్‌బజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డా.నరసింహమూర్తి, డా.జ్ఞాన అభిలాష్ నేతృత్వంలో వైద్యులు రహిమా, జబీనా తాజ్, ప్రశాంత్, సునీత, అరుణ్‌కుమార్, రవీంద్రరెడ్డి, గంగాభవాని 101 మందికి పరీక్షలు నిర్వహించారు. సిబ్బంది రుక్మిణి, రేఖ, హొన్నూరమ్మ, ఈశ్వరమ్మ, చంద్రనాయక్, అనుశ్రీ పాల్గొన్నారు.



గుండె జబ్బుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలను విడుదల చేస్తున్న ఉపమేయర్ డి.సుకుం, తదితరులు



చికిత్స కోసం వేచిచూస్తున్న వృద్ధులు

రేపు 'విధాన్ సే సమాధాన్' కార్యక్రమం

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా న్యాయసేవా ప్రాధికార, మహిళా, శిశు అభివృద్ధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5న ఉదయం 10గంటలకు జిల్లా పంచాయతీ కార్యాలయం ఆవరణలోని నజీర్ సభాభవనంలో 'విధాన్ సే సమాధాన్' కార్యక్రమం కింద చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయమూర్తి, న్యాయసేవా ప్రాధికార సదస్య కార్యదర్శి రాజేశ్ ఎన్.హొసమని హాజరవుతారని చెప్పారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

03-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.80	1617.37
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10,203	1825
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10,176	9,728
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.382	54.267


గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

సదుపాయాల కల్పనకు గని కార్మికుల డిమాండ్



గనులు, భూవిజ్ఞాన శాఖ కార్యాలయం అధికారికి వినతి పత్రం అందజేస్తున్న కార్మిక నేతలు, కార్మికులు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి తాలూకా హరగినడోణి సమీపంలోని టి.బి.ఎ.(టిన్ బైరైటీస్ ఆస్‌బెస్టాస్)లో పనిచేసిన గని కార్మికులకు కంపెనీ యజమానులు మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సంయుక్త గని కార్మిక సంఘం, హరగినడోణి టి.బి.ఎ.గని కార్మికర సంఘం ఆధ్వర్యంలో గురువారం కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఏఐయూటీయూసీ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ మాట్లాడుతూ టి.బి.ఎ. కంపెనీలో ఏళ్ల తరబడి పనిచేసిన గని కార్మికులకు చట్టప్రకారం లభించే మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. రెడ్ ఆక్సైడ్ కంపెనీలో మొత్తం 120 మంది కార్మికులు విధులు నిర్వహించారు. వారిలో కొంత మంది విశ్రాంతి పొందారు. మరి కొంత మంది మృతిచెందారు. మిగిలిన వారు విధులు నిర్వహిస్తున్నారు. కంపెనీ నుంచి వచ్చే దుమ్ము ధూళితో క్యాన్సర్, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు. మృతిచెందిన కార్మికులకు పరిహారం అందజేయాలని కంపెనీ యజమానులకు పలుమార్లు వినతిపత్రం అందజేసినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆరోపించారు. కంపెనీ వచ్చే దుమ్ము ధూళితో చుట్టుపక్కల రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా నష్టపోయాయి. సుమారు రూ.150 కోట్లు వరకు నష్టం జరిగింది. రైతులకూ పరిహారం అందజేయాలని కోరారు. నాయకులు సోమశేఖర్ గౌడ, డా.ప్రమోద్, దేవదాస్, శంక్రప్ప, గిరిరాజ్, హులిగమ్మ, సీతాబాయి, కార్మికులు పాల్గొన్నారు.


చాముండి ఆలయంలో హారతి స్వీకరిస్తున్న సిద్ధరామయ్య, హంప నాగరాజయ్య


సాంస్కృతిక సంబరాల ప్రారంభ వేదికపై కళాకారుడు భజంత్రీకి సత్కారం


పూజ అనంతరం కుంకుమ పెట్టించుకుంటున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్



ఆలయం వెలుపల కొబ్బరికాయ కొడుతున్న డీకే శివకుమార్



రాచనగరికి దసరా రాజసం!

మైసూరు, న్యూస్‌టుడే : పుష్కర లగ్నంలో నాడ దేవత చాముండి ఉత్సవ మూర్తికి సాహితీవేత్త, నాడోజ, హంప నాగరాజయ్య పుష్పార్చన చేసి అధికారికంగా దసరా ఉత్సవాలను గురువారం ఉదయం ప్రారంభించడంతో భక్తుల జయజయనాదాలు మిన్నంటాయి. అంతకు మునుపు.. సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకేశివకుమార్, మంత్రులు హెచ్‌సీ పాటిల్, హెచ్‌సీ మహదేవప్ప, ఎమ్మెల్యేలు జీటీ దేవేగౌడ, తన్వీర్ సేఠ్ తదితరులు అమ్మవారి ఆలయంలో పూజలు చేసుకున్నారు. ధ్వజ స్తంభానికి సిద్ధరామయ్యతో కలిసి 'హంప' పూజ చేశారు. ఆలయం వెలుపల డీకే శివకుమార్ కొబ్బరికాయ కొట్టి, ప్రభుత్వంపై ఉన్న దిష్టి తొలగిపోవాలని కోరుకున్నారు. కన్నడ ప్రాంతం, నీటి కోసం పోరాటాలు చేస్తున్న వారిని నిందితులుగా కాకుండా, ప్రేమ, అభిమానాలతో చూడాలని హంప నాగరాజయ్య పిలుపునిచ్చారు. ఇజ్రాయిల్-పాలస్తీనా, రష్యా-ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం నిలవాలని తాను అమ్మవారికి కోరుకున్నానని తెలిపారు. ఉత్సవాలకు మైసూరు నగరం నవ వధువులా సింగారించుకుంది. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. క్రీడా పోటీలు, పుస్తక మేళా, జానపద రంగ ఉత్సవం, శిల్పకళా శిబిరం, ఆహార మేళా, చలనచిత్రోత్సవాలు, ఫల పుష్ప ప్రదర్శన తదితరాలు విజయదశమి వరకు కొనసాగనున్నాయి. చివరి రోజు జంబూ సవారీ, కాగడాల ప్రదర్శనతో ఉత్సవాలకు తెరపడనుంది. ఈ ఏడాది అన్ని ప్రాంతాల్లో పుష్కలంగా వర్షాలు కురవడంతో ఘనంగా శరన్నవరాత్రులను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాచనగరి మొత్తం పండగ వాతావరణం నెలకొంది. అన్ని కూడళ్లు, వీధులు, పురాతన భవంతులను విద్యుత్తు దీపాలతో అలంకరించారు.

బనశంకరికి ప్రత్యేక పూజలు


బనశంకరి అమ్మవారికి అలంకరణ

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : శరన్నవరాత్రుల వేడుకలు రాజధాని నగరంలో గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఒక్కో ఆలయంలో.. ఒక్కో రీతిలో శక్తిమాతలను పూజించడం ఆనవాయితీ. ప్రఖ్యాత బనశంకరి మాత సన్నిధానంలో అమ్మవారిని పంచవర్ణాలతో తీర్చిదిద్దడం కనువిందు చేసింది. ఉదయం గణపతి హోమంతో వేడుకలు ప్రారంభించారు. హోమ, పూజాదుల్లో భక్తులు పాల్గొన్నారు. హనుమంతనగర్ శేషమహాగణపతి ఆలయంలో పద్మావతి, పార్వతీ అమ్మవార్లను అలంకరించారు. పార్వతీ అమ్మవారు శుక్రవారం బ్రాహ్మీ రూపంలో హంసవాహినిగా భక్తులను పలుకరించారు. ఉదయం పంచామృత అభిషేకం, హోమాదులు కొనసాగాయి.


విగ్రహాలను ప్రదర్శిస్తున్న రూపదర్శులు

బొమ్మలకొలువు.. సంబరాల నెలవు!

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : దసరా అనగానే బొమ్మల కొలువు గుర్తుకు వస్తుంది. కన్నడిగుల రాజధాని బెంగళూరు నగరంలో పలు దశాబ్దాల నుంచి బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్న వారి సంఖ్య తక్కువేమీ కాదు. సేకరించిన బొమ్మలను కొందరు ఔత్సాహికులు భారతీయ విద్యాభవన్‌లో, మరికొందరు గరుడామాల్‌లో గురువారం ప్రదర్శనకు ఉంచారు. వీటిలో కొన్ని తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన బొమ్మలు కూడా ఉన్నాయని కొందరు గృహిణులు తెలిపారు. విజయదశమి వరకు ఈ బొమ్మల కొలువులను ఉచితంగా వీక్షించేందుకు నిర్వాహకులు అవకాశం కల్పించారు. మొదటి రోజే ఈ బొమ్మల వద్ద ఫొటోలు, స్వీయ చిత్రాలను తీసుకునేందుకు సందర్శకులు ఆసక్తిని చూపించారు.


తన కుమార్తెకు బొమ్మల్ని చూపిస్తున్న గృహిణి


భారతీయ విద్యాభవన్‌లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో పుష్పకవిమానం


అబ్బా.. ఈ బొమ్మలు ఎంత బాగున్నాయో


వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులపై రంగు కాగితాల జల్లు

క్రీడోత్సవాల ఢంకా భళా!

మైసూరు, న్యూస్‌టుడే : విఖ్యాత దసరా ఉత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పుష్ప ప్రదర్శన, క్రీడోత్సవాలను గురువారం సాయంత్రం ప్రారంభించారు. భారత హాకీ జట్టు నాయకుడు హర్మన్ ప్రీత్ సింగ్‌ను సత్కరించి, రూ.5 లక్షల చెక్కు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు, జానపద జట్ల నుంచి గౌరవ వందనాన్ని అందుకున్నారు. చాముండేశ్వరి విహార మైదానంలో ఏర్పాటు చేసిన సీఎం కప్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారుల శ్రమ, లక్ష్య సాధనకు సరైన శిక్షణ అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దసరా ఉత్సవాలకు దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులు ముందు నిర్వహించే క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపిస్తే జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవచ్చన్నారు. నేటి (శుక్ర) నుంచి ఆహార మేళా, క్రీడా పోటీలు, ఫలపుష్ప ప్రదర్శనలకు సందర్శకులను అనుమతించనున్నారు. ఫల- పుష్ప ప్రదర్శనలో భాగంగా పాత పార్లమెంటు నమూనా, మొదటి తరం నాయకుల విగ్రహాలు, మినీ ఉద్యానవనాలు, వామన వృక్షాల ప్రదర్శన ఉన్నాయి.


హర్మన్‌ప్రీత్ సింగ్‌ను సత్కరించి.. రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న సిద్ధరామయ్య

మూడేళ్లలో చిత్రనగరి నిర్మాణం


మంత్రి మునియప్పతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న సిద్ధరామయ్య

మైసూరు, న్యూస్‌టుడే : కన్నడ చిత్రపరిశ్రమకు నటుడు ద్వారకీశ్ సేవలు అమూల్యమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. ఈ ఏడాది ద్వారకీశ్‌ను స్మరించుకుంటూ చిత్రోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. మైసూరులో ఆయనను అనేకసార్లు కలసి, వివిధాంశాలపై చర్చించిన నేపథ్యాలను గుర్తు చేసుకున్నారు. దసరా పండగను పురస్కరించిన మైసూరు మహారాజ కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రోత్సవాలను ముఖ్యమంత్రి ప్రారంభించి మాట్లాడారు. మైసూరు శివార్లలోని ఇమ్మావు గ్రామంలో 150 ఎకరాల విస్తీర్ణంలో ఫిలిం సిటీ నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తామని ప్రకటించారు. రెండో దశలో మరో 50 ఎకరాల్లో దాన్ని విస్తరిస్తామని వెల్లడించారు. గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చిత్రనగరి నిర్మాణానికి 110 ఎకరాలను కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. దానితో పాటు మరో 40 ఎకరాలు కలిపి మొదటి దశలో 150 ఎకరాల్లో సినీపరిశ్రమ అవసరాలకు నిర్మాణాలు చేపడతామని చెప్పారు. చిత్రపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎక్కువ కన్నడ సినిమాలు విడుదల కావాలని, వాటిని థియేటర్లకు వెళ్లి చూడాలని ప్రేక్షకులను కోరారు. శుక్రవారం నుంచి పదో తేదీ వరకు దేశ, విదేశాలకు చెందిన చలనచిత్రాలను ఎంపిక చేసిన థియేటర్లలో ప్రదర్శించనున్నారు. సినీ అభిమానులు, పర్యాటకులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, ఉత్తమ చిత్రాలను వీక్షించాలని కోరారు. మంత్రులు కేహెచ్ మునియప్ప, మహదేవప్ప, ఎమ్మెల్యే పుట్టరంగశెట్టి, గ్యారంటీ పథకాల అనుష్ఠాన సమితి ఉపాధ్యక్షురాలు పుష్పా అమరనాథ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


రాజధాని నగరంలో వివిధ ప్రాంతాల్లో సొరంగ మార్గాల నిర్మాణానికి ప్రణాళిక

ఖజానా సహకరిస్తే.. ప్రగతి నజరానా

● నిధుల సేకరణకు కసరత్తు ● మౌలిక వసతులకే పెద్దపీట


రహదారిపై గంటల తరబడి వాహనదారుల ఎదురుచూపులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాష్ట్రరాజధాని బెంగళూరు నగరంలో మౌలిక సౌకర్యాల విస్తరణ పెనుసవాల్‌గా నిలిచింది. ప్రస్తుత అవసరాలకే రూ.59 వేల కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. బృహత్ బెంగళూరు పథకాలు అమలు చేయాలంటే ఆ మొత్తం అవసరమనే తేల్చారు. అందులో రూ.39 వేల కోట్లను రుణం రూపంలో ఆర్థిక సంస్థల నుంచి సేకరించేందుకు అనుమతించాలని పాలికె అధికారులు ఇటీవలే రాష్ట్రనగరాభివృద్ధి శాఖకు ప్రతిపాదనలు పంపించారు. రాజధానిని పట్టిపీడిస్తున్న ట్రాఫిక్ ఇక్కట్లపై దృష్టి సారించాలనేది కీలకాంశం. సంచార రద్దీ నియంత్రణకు ఎక్కువ నిధులు వ్యయం చేస్తారు. హెబ్బాళ్ పశువైద్యశాల నుంచి బసవేశ్వరకూడలి, జేపీనగర వరకు 45 కిలోమీటర్ల పొడవైన సొరంగ మార్గం నిర్మాణానికి రూ.36 వేల కోట్లు అవసరమని అంచనా వేశారు. అందులో రూ.16 వేల కోట్లను పాలికె సమకూర్చుతుండగా.. మిగతా నిధులను వివిధ ఆర్థిక సంస్థల నుంచి రుణం తీసుకుంటామని పాలికె చీఫ్ కమిషనర్ తుషార్‌గిరినాథ్ వివరించారు. సంచార రద్దీగా ఉండే ప్రాంతాల్లో వంద కిలోమీటర్ల మేరకు 17 డబుల్ డెక్కర్ స్థాయి ఉపరితల వంతెనలను నిర్మిస్తారు. ఆ పథకాలకు అవసరమైన నిధులు రూ.20 వేల కోట్లను నాలుగేళ్లలో పాలికె ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పాలికె అధికారులు ప్రకటించారు. మిగతా రూ.39 వేల కోట్లు వివిధ సంస్థల నుంచి రుణ సదుపాయం పొందేందుకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రూ.10 వేల కోట్లను బాండ్ల రూపంలో ప్రజల నుంచి సేకరించేందుకు పథకాన్ని సిద్ధం చేశారు. గతంలో 1999లో మాత్రమే పాలికె బాండ్ల రూపంలో రూ.250 కోట్లు సేకరించిన విషయం తెలిసిందే. ఇన్నాళ్లకు.. మౌలిక సౌకర్యాల కోసం ఎక్కువ నిధులు బాండ్ల రూపంలో సేకరించనున్నారు.


వలయ వర్తుల మార్గంలో నిత్యం స్తంభించిపోతున్న సంచారం

సకాలంలో పక్కా గృహాల నిర్మాణం

అధికారులకు మంత్రి ఆదేశం


అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్, చిత్రంలో ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర శివారు ప్రాంతమైన ముండరిగిలో కొత్తగా నిర్మించిన మహాత్మాగాంధీ టౌన్‌షిప్‌లో ఇప్పటికే పూర్తయిన 820 పక్కా గృహాలను లబ్ధిదారులకు ఈ ఏడాది చివరిలో వితరణ చేయడానికి సిద్ధం చేసుకోవాలని జిల్లా బాధ్య మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ అధికారులకు సూచించారు. గురువారం బెంగళూరులో మంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి పాల్గొని మహాత్మాగాంధీ టౌన్‌షిప్‌లో జరుగుతున్న పక్కా గృహాల నిర్మాణంపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశానికి హాజరైన జిల్లా పంచాయతీ ముఖ్య అధికారి రాహుల్ శరణప్ప సంకనూర, నగర పాలికె కమిషనర్ ఖలీల్‌సాబ్ పక్కా గృహాల నిర్మాణంపై చర్చించారు. 820 ఇళ్లలో పెండింగ్‌లో ఉన్న గృహాలను నిర్దిష్ట సమయంలోపు పూర్తి చేసి ఈ ఏడాది చివరిలోపు పంపిణీకి సిద్ధం చేస్తామని అధికారులు మంత్రి, ఎమ్మెల్యేలకు సూచించారు. ఈ నెలలోపే పక్కా గృహాలు పూర్తి చేసి తమకు చూపించాలి. అనంతరం మంత్రితో చర్చించి లబ్ధిదారులకు అందజేసే తేదీలను ప్రకటిస్తామన్నారు.

హంపీ వీసీకి సోదే సదాశివరాయ పురస్కారం

హొసపేటె, న్యూస్‌టుడే: ఉత్తర కన్నడ సోదె రాజవంశజులు ఏటా ప్రముఖ విద్వాంసులకు మహారాజు సోదె సదాశివరాయ పేరిట ప్రదానం చేసే పురస్కారానికి హంపీ కన్నడ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ డి.వి.పరమశివమూర్తి ఎంపికయ్యారు. ఈ నెల 19, 20 తేదీల్లో ఉత్తర కన్నడ జిల్లా శిరసీలో ఏర్పాటు చేసిన సోందా చరిత్రోత్సవం, రాష్ట్రస్థాయి చరిత్ర సమ్మేళనంలో ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేస్తున్నారు.



బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్- కిలో..రూ.లలో)

● బీన్స్-	55
● క్యారెట్-	70
● బీరకాయలు-	40
● క్యాబేజి-	20
● కాలిఫ్లవర్ (ఒక్కోటి)-	25
● సొరకాయ-	35
● దొడ్డకాయలు-	35
● పొట్లకాయ-	35
● టమాటా(నాటు)-	60
● టమాటా-	45
● గుమ్మడి-	40
● ఆలుగడ్డ-	40
● ఉల్లిగడ్డలు (మేలురకం)	70
● ఉల్లిగడ్డలు (సాధారణ)	50
● వెల్లుల్లి -	390
● సాంబారు ఉల్లి-	95
● బీట్‌రూట్-	25
● వంకాయలు-	35
● బెండకాయలు-	40
● ముల్లంగి-	40
● నిమ్మకాయ-	200
● వాషింగ్టన్ ఆపిల్:	305
● సిమ్లా ఆపిల్-	135
● గ్రీన్ ఆపిల్-	320
● అరటి కాయలు-	45
● సపోటా-	55
● పైనాపిల్-	38
● బొప్పాయి-	44
● ఆరంజి-	70
● బత్తాయి-	65

మారణాయుధాలతో దాడి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : నడి రోడ్డులో మారణాయుధాలతో ప్రత్యర్థులపై దాడి చేసి పరారైన నిందితుల కోసం హనుమంతనగర ఠాణా పోలీసులు గాలింపు తీవ్రం చేశారు. శ్రీనగరలోని రాఘవేంద్ర బ్లాక్‌లో ఇటీవల వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు తీసుకువెళుతున్న బృందంపై కొందరు కత్తులు, క్రికెట్ బ్యాట్లతో దాడి చేసి పరారయ్యారు. దాడి ఘటనను స్థానికులు వీడియో తీసి, సామాజిక మాధ్యమంలో పోలీసులకు ట్యాగ్ చేసి పోస్టు చేశారు. స్వయం ప్రేరితంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు, వీడియోలో కనిపించిన నిందితుల కోసం గాలింపు తీవ్రం చేశారు.

ఆ అధికారి తీరు.. విస్మయం

శివమొగ్గ, న్యూస్‌టుడే : శివమొగ్గ రెండో బెటాలియన్ కేఎస్ఐఎస్ఎఫ్ అడిషనల్ ఎస్పీ మంజునాథ్ అణజి విమానాశ్రయం రన్‌వేపై రీల్స్ చేశారు. సమవస్త్రాలు ధరించి, తుపాకీతో విన్యాసాలు చేస్తూ, రీల్స్, వీడియోలు చేయకూడదన్న నిబంధనలను ఆయన ఉల్లంఘించారు. దానితో పాటు తన కుటుంబ సభ్యులతో కలిసి రన్‌వేపై రీల్స్ చేశారు. దీనిపై పలువురు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

హైకోర్టుకు సెలవులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : దసరా పండగ నేపథ్యంలో ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు)కు గురువారం నుంచి పది రోజులు సెలవులను ప్రకటిస్తూ హైకోర్టు రిజిస్ట్రారు జనరల్ ఇ.రాజీవ్‌గౌడ ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర కేసుల విచారణను సెలవు పీఠం అక్టోబరు 4, 9వ తేదీల్లో చేపడుతుందని తెలిపారు. అక్టోబరు 14 నుంచి న్యాయస్థానంలోని అన్ని పీఠాలు పని చేస్తాయని వెల్లడించారు.

క్రీడా కోటా విస్మరించినందుకు పరిహారం



బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : క్రీడావిభాగంలో ఎంబీబీఎస్ సీటు పొందేందుకు అర్హత ఉన్నప్పటికీ.. సీటు కేటాయించలేదని అంతర్జాతీయ చదరంగం క్రీడాకారిణి సంజనా రఘునాథ్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. ఆమెకు సీటు ఇవ్వనందుకు రూ.10 లక్షల పరిహారాన్ని ఇవ్వాలని జస్టిస్ ఎన్‌వీ అంజారియా, జస్టిస్ కేవీ ఆనంద్‌ల పీఠం బుధవారం ఆదేశించింది. బెంగళూరుకు చెందిన సంజన 2018లో ఆసియా యువజన ఛాంపియన్‌షిప్ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో బంగారు పతకాలు దక్కించుకున్నారు. వాటి ఆధారంగా సీటు ఇవ్వాలని 2023లో ఆమె దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ కోటాలో సీటు రాకపోవడంతో ప్రైవేటు కళాశాలలో రూ.11 లక్షలు చెల్లించవలసి వచ్చింది. అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఆమెకు రూ.10 లక్షల పరిహారాన్ని ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

బాడుగ కోసం దూషణపర్వం

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : ఎక్కువ బాడుగ ఇచ్చేందుకు నిరాకరించిన ఒక యువతిని దూషించిన ఆటో డ్రైవరు కోసం నగర పోలీసులు గాలింపు తీవ్రం చేశారు. సిల్కుబోర్డు వెళ్లేందుకు వేచి ఉన్న ఆమె వద్దకు ఆటో డ్రైవరు వచ్చాడు. రూ.300 ఇవ్వాలని డ్రైవరు కోరగా, ఆమె రూ.150 ఇస్తానని చెప్పింది. ఒక్కసారిగా కోపం పెంచుకున్న డ్రైవరు ఆ యువతిని అనరాని మాటలంటూ దూషించాడు. చివరికి ఆమె చరవాణిలో రికార్డు చేసుకుని పోలీసుల ఎక్స్ కార్ప్ ఖాతాలో పోస్టు చేసింది. స్వయం ప్రేరితంగా కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మేలుకోటెలో శరన్నవరాత్రులు

మండ్య, న్యూస్‌టుడే : చారిత్రక మేలుకోటె పురంలో గురువారం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అక్టోబరు 11న మహానవమి, 12న విజయదశమితో ఉత్సవాలు పూర్తి కానున్నాయి. మహాలక్ష్మి కల్యాణ నాయకి అమ్మవారికి బంగారు శేషవాహనోత్సవాన్ని నిర్వహించగా, చెలువనారాయణ స్వామి వారిని అశ్వ వాహనంపై ఆలయ వీధుల్లో ఊరేగించారు. ఉత్సవాల్లో భాగంగా నిత్యం పూజా కైంకర్యాలతో ప్రారంభించి, వెండి పల్లకీల్లో ఉత్సవ మూర్తులను ఊరేగించనున్నారు. మైసూరు, హొయ్సళ రాజులకు కులదైవంగా మేలుకోటె చెలువనారాయణ స్వామి ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి నిధులు రాకవడం లేదు. మైసూరు రాజవంశస్థులే ఏటా రూ.3 లక్షల వరకు నిధులు విడుదల చేస్తున్నారు. చట్టసభ ప్రతినిధులు, ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే మైసూరు దసరాకు వచ్చే పర్యాటకులు ఇక్కడకు కూడా వచ్చి వెళతారని స్థానికులు, ఆలయం ప్రతినిధులు పేర్కొన్నారు.


కల్యాణ నాయకి అమ్మవారి ఉత్సవమూర్తి


ఆలయ వీధుల్లో అశ్వ వాహనంపై చెలువనారాయణుడు

అసోం నుంచి హుబ్బళ్లికి 5న ఏకముఖ రైలు సంచారం

హొసపేటె, న్యూస్‌టుడే: అసోం రాష్ట్రం దిబ్రూగడ్ నుంచి హుబ్బళ్లికి ఏకముఖ రైలు సంచారాన్ని 5న ప్రారంభిస్తున్నట్లు నైరుతి రైల్వే హుబ్బళ్లి విభాగం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. దసరా పండగ నేపథ్యంలో ఈ రైలును నడుపుతున్నారు. 5న దిబ్రూగడ్ నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు బయల్దేరే ఈ రైలు (సంఖ్య: 07359) 8న ఉదయం 9 గంటలకు హుబ్బళ్లి చేరుకుంటుంది. మహర్కటియ, మరియాని, గువాహటి, రాంపుర్‌హట్, కటక్, భువనేశ్వర్, బెరహంపూర్, పాలసా, శ్రీకాకుళం, విజయనగరం, సింహాచలం, దువ్వాడ, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నంద్యాల, గుంతకల్లు, బళ్లారి, హొసపేటె గుండా హుబ్బళ్లి చేరుకుంటుంది. ఈ రైల్లో పది స్లీపర్‌క్లాస్, రెండు సాధారణ బోగీలు ఉంటాయని ఒక ప్రకటనలో తెలిపారు.

బెంగళూరు
• బెంగళూరు • హోసూరు

గాంధీ ఆదర్శాలు అనుసరణీయం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: ఆధునిక సమాజంలోనూ మహాత్ముడి ఆదర్శాలు అనుసరణీయమని కర్ణాటక పొట్టి శ్రీరాములు తెలుగు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వీరనారాయణ తెలిపారు. మహాత్మగాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఇక్కడ జిగణిలోని సంస్థ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీజీ సంఘం అధ్యక్షుడు పి.లక్ష్మీరంగారెడ్డి, కోశాధికారి కాశీంపీరా, ప్రతినిధులు పి.వెంకటసుబ్బారెడ్డి, భైరెడ్డి పుల్లారెడ్డి, వినోద్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఎన్.రవిశంకర్‌రెడ్డి, రెడ్డిబాబు, పి.నాగయ్య తదితరులు పాల్గొన్నారు.


గాంధీ చిత్రపటానికి పదాధికారుల పుష్పార్చన

స్నూకర్ విజేత మహమ్మద్ ముస్తఫా

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : కర్ణాటక బిలియర్డ్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర ర్యాంకింగ్ సబ్-జూనియర్ బాలుర స్నూకర్ పోటీలో మహమ్మద్ ముస్తఫా విజేతగా నిలిచాడు. గురువారం రాష్ట్ర బిలియర్డ్స్ సంఘంలో జరిగిన ఈ పోటీలో సెమీస్‌లో రిధిమన్‌పై 2-1 తేడాతో గెలిచిన మహమ్మద్ ఫైనల్స్‌లో 2-1తో ఆదిత్య విజయ్‌చావ్లాపై విజయం సాధించాడు.


ఆదిత్య విజయ్‌చావ్లా, మహమ్మద్ ముస్తఫా

హోసూరు కబుర్లు

అభివృద్ధి పనుల పరిశీలన

హోసూరు, న్యూస్‌టుడే: హోసూరు పంచాయతీ యూనియన్ పరిధి గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను గురువారం కృష్ణగిరి జిల్లా కలెక్టర్ సరయు, సబ్-కలెక్టర్ ప్రియాంక, వివిధ అధికారుల బృందం పరిశీలించింది. తొలుత అచ్చెట్టిపల్లి గ్రామ పంచాయతీ సూతాళం గ్రామంలో ఖనిజ సంపద నిధులు రూ.6 లక్షలతో నిర్మించిన సామూహిక భవనంలో నడుపుతున్న చౌక దుకాణాన్ని సందర్శించి కార్డుదారులకు సరకులు సక్రమంగా అందుతున్నాయో లేదో తనిఖీ చేశారు. గోపసపల్లి పంచాయతీలో సీఎం రహదారుల నిర్మాణ పథకం కింద రూ.2.54 కోట్లతో పూర్తిచేసిన తారు రోడ్డు నాణ్యతను పరిశీలించారు. డి.బారందూరులోని ప్రభుత్వ ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో నర్సరీ పిల్లలకు రూ.32.80 లక్షలతో నిర్మించిన రెండు అదనపు తరగతి గదులను సందర్శించారు. అంగనవాడీ పాఠశాలను సందర్శించి పిల్లలతో ముచ్చటించారు. అదే గ్రామంలో నరసమ్మ అనే పేద మహిళ ఇల్లు శిథిలావస్థకు చేరడంతో ఆమె కోరిక మేరకు మరమ్మతులకు రూ.44 వేలు మంజూరు చేశారు. ఆ పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టరు వెంట తహసీల్దారు చిన్నస్వామి, బీడీఓ అధికారులు బాలాజీ, శాంతలక్ష్మి, ఇంజినీర్లు శ్యామల, విమల తదితరులున్నారు.


రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టరు సరయు, సబ్-కలెక్టరు ప్రియాంక, ఇంజినీర్లు

డీఎంకే మహిళా విభాగం నిర్వాహకురాలి నియామకం

హోసూరు, న్యూస్‌టుడే: డీఎంకే రాష్ట్ర నాయకుల ఆదేశాలతో మహిళ విభాగం కార్యదర్శి హెలన్ డేవిడ్‌సన్ హోసూరు నగర నిర్వాహకురాలిగా తెలుగు మాతృభాష కలిగిన సునందను నియమించారు. ఆమె 25 ఏళ్లుగా పార్టీ సభ్యురాలిగా ఉంటూ వివిధ పదవులు అలంకరించారు. సహ నిర్వాహకురాలుగా అమరావతి, కార్యనిర్వాహక సభ్యులుగా కమల, సుందరమ్మాళ్, శ్యామల, అనిత తదితరులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సునంద హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాష్‌ను పెద్దబేళగిండపల్లి గ్రామంలోని ఆయన నివాసంలో కలిసి ఆశీసులు పొందారు. మేయరు ఎస్.ఎ.సత్యను కలిశారు.


ఎమ్మెల్యే ప్రకాష్‌తో సునంద, కార్యనిర్వాహక సభ్యులు

కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు

పావగడ, న్యూస్‌టుడే : సమాజ కల్యాణశాఖ తరపున పారిశుధ్య కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు ఇవ్వనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి లోపు, పదో తరగతి తర్వాత చదివే విద్యార్థులు ఆన్‌లైన్‌లో రాష్ట్ర విద్యార్థి పోర్టల్లో నవంబరు 24 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాల కోసం పావగడ సమాజ కల్యాణశాఖ కార్యాలయంలోని గ్రేడ్-1 అధికారిని సంప్రదించాలని సూచించారు.

చదరంగంలో పేద బాలలకు ఉచిత శిక్షణ

బెంగళూరు (క్రీడలు): శివమొగ్గ యాదవ స్కూల్ ఆఫ్ చెస్ ఆర్థికంగా వెనుకబడిన బాలలకు ఉచితంగా చదరంగం శిక్షణ ఇస్తున్నట్లు అఖిలభారత చెస్ సంఘం శిక్షకుడు ప్రాణేష్‌యాదవ్ గురువారం తెలిపారు. పిల్లలకు చెస్‌పై ఆసక్తి పెంచేందుకు 5 నుంచి 9 వరకు రాత్రి 7 గంటల నుంచి ఆన్‌లైన్‌లో, జూమ్ యాప్‌లో తర్ఫీదు ఇస్తారని చెప్పారు. రాణిబెన్నూరు, హాసన విద్యా శాఖ నిర్వహించనున్న అండర్-17, 14 అంతర పాఠశాలల చదరంగం పోటీలకు ఎంపికైన వారు తర్ఫీదు లబ్ధి పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు చరవాణి సంఖ్య 9242401702లో సంప్రదించాలని కోరారు.

బంగారం కొనుగోలుకు ప్రాధాన్యం

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: ధరతో సంబంధం లేకుండా బంగారం కొనుగోలుకు ఎక్కువ సంఖ్యలో ముందుకొస్తున్నారని ఎమ్మెల్సీ టీఏ శరవణ అన్నారు. జయనగరలో గోల్డ్ షాపింగ్ ఫెస్టివల్ మూడో ఎడిషన్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బంగారం ఆర్థిక స్థాయిని పెంచడంతో పాటు కష్టకాలంలో అక్కరకు వస్తుందన్నారు. నవంబరు 16 వరకు 45 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా అపరంజి ఉత్సవం కొనసాగుతుందన్నారు. తొలుత బెంగళూరు జ్యువెలరీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ చేతన్‌కుమార్ మెహతా, బెంగళూరు గోల్డ్ ఫెస్టివల్-2024 అధ్యక్షుడు సురేశ్‌కుమార్ ఘూనతో కలిసి జయనగరలో ఆయన గోడపత్రికలు విడుదల చేశారు.


గోడపత్రికలు ప్రదర్శిస్తున్న శరవణ, ఇతర ప్రతినిధులు

వీధి కుక్కలతో అప్రమత్తం

మండ్య, న్యూస్‌టుడే: వీధి శునకాలు, పిచ్చి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలని పశు ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ప్రభుస్వామి విద్యార్థులకు సూచించారు. పిచ్చికుక్క కరిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే గాయాన్ని శుభ్రం చేసుకుని, ప్రభుత్వాసుపత్రికి వెళ్లి యాంటీ రేబిస్ ఇంజక్షన్ చేయించుకోవాలని చెప్పారు. మేలుకోటె ప్రభుత్వ ప్రాథమికోన్నత బాలుర పాఠశాలలో రేబిస్ లక్షణాలు, చికిత్స వివరాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని పలు సూచనలుచేశారు.

వానొస్తే... మునగాల్సిందే

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నగరంలో చిన్నపాటి వానలకే రహదారులతో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. రెండు రోజులుగా రాత్రింబవళ్లు వర్షం కురుస్తోంది. నగరంలో ఎప్పుడు వాన పడుతుందో, ఎండ వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. బుధవారం పగటి ఉష్ణోగ్రత 31 డిగ్రీలు దాటగా, రాత్రి పది గంటల నుంచి అర్ధరాత్రి వరకు మోస్తరు వర్షం పడింది. తిరిగి గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు పెద్ద వాన పడింది. మొన్నటివరకు ఉపముఖ్యమంత్రి ఆదేశాలతో రోడ్లపై పడిన గుంతలను పూడ్చేశామని నగర పాలికె అధికారులు గొప్పలు చెప్పారు. ఆ పనులు ఎంత నాణ్యతగా ఉన్నాయో ఈ రెండు రోజులు వర్షాలు చెప్పేశాయి. తిరిగి గుంతలు తేలడంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. ప్రధానంగా రింగ్‌రోడ్డు, హెబ్బాళ్ కూడలి, బీఈఎల్ కింది వంతెన, సుమనహళ్లి కూడలి జలమయంగా మారాయి. హెబ్బాళ్ రహదారిపై భారీగా నీరు చేరడంతో వాహన రద్దీ నెలకొంది. సంచారాన్ని మాములు స్థితికి తెచ్చేందుకు పోలీసులు చాలా సేపు శ్రమించాల్సి వచ్చింది.


రహదారిపై నిలిచిన నీటితో అవస్థలు


టౌన్‌హాల్ సమీపంలో వాహనదారుల తిప్పలు

విరిగిపడిన చెట్ల కొమ్మలు...

నగరంలోని బాణసవాడి, యలహంక, భద్రప్ప లేఅవుట్, ఎంఎస్ రోడ్డు, యశ్వంతపుర తదితర ప్రాంతాల్లో గాలివానకు పెద్ద పెద్ద చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుకడ్డంగా పడటంతో వాహనచోదకులతో పాటు పాదచారులకు అవస్థలు తప్పలేదు. కింది వంతెనల్లో నీరుచేరడంతో వాహనదారులు సంచరించేందుకు వెనుకంజ వేయడం కనిపించింది. ఒక్కలిపురం, కోడిగేహళ్లి, సదాశివనగర, శేషాద్రిపురం ప్రాంతాల్లోని కింద వంతెనల్లో మోకాలు లోతు వరకు నీరు నిలబడింది. ఆ నీటిని బయటకు పంపించేందుకు పాలికె సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. మరో రెండు రోజులు పాటు నగరంలో భారీ వర్షం కురిసే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెప్పడంతో నగరవాసులు, వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. వానా కాలంలో నెలకొనే సమస్యలపై స్పందించేందుకు ప్రహార బృందాన్ని సిద్ధంగా ఉంచినట్లు పాలికె అధికారులు తెలిపారు.


నిల్వ నీటిలో వాహనాల సంచారం

5వ తేదీ వరకు వాన

బెంగళూరు (శివాజీనగర): నగరంలోని మల్లేశ్వరం, మెజెస్టిక్, చిక్కపేట, ఉప్పారపేట, శివాజీనగర, విధాన సౌధ, రాజాజీనగర, రేస్‌కోర్సు, మహారాణి కళాశాల, వైట్‌ఫీల్డ్, సీఐడీ కార్యాలయం, ప్యాలెస్ రోడ్డు ప్రాంతాల్లో పలుచోట్ల రహదారులపై నీరు నిలబడింది. వాహనచోదకులతో పాటు కార్యాలయాలు, కళాశాలల నుంచి ఇళ్లకు వెళ్లేవారు నానా అవస్థలు పడ్డారు. 5వ తేదీ (శనివారం) వరకు నగరంలో ఇదే తరహా వర్షపాతం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నాగరబావి బీడీఏ కాంప్లెక్స్ సమీపంలో భారీ వృక్షం రోడ్డుకడ్డంగా కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

ట్రెక్కింగ్‌కు అంతర్జాల అనుమతి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: రాష్ట్ర పర్యాటకరంగం అభివృద్ధిలో భాగంగా పరిసరాలకు హాని కలగకుండా రోజూ 300 మందికి పర్వతాల ట్రెక్కింగ్‌కు అంతర్జాలం ద్వారా అనుమతి ఇస్తున్నట్లు అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ బి.ఖండ్రె తెలిపారు. గురువారం ఇక్కడ వికాస సౌధలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రెక్కింగ్ అంతర్జాలం నమోదు ప్రక్రియను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత జనవరి 26, 27వ తేదీల్లో కుమారపర్వతకు 5 నుంచి 6 వేలమంది ఒకేసారి ట్రెక్కింగ్ కోసం రావడంతో గందరగోళం ఏర్పడిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలనే అంతర్జాలంలో పేర్ల నమోదు ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. కుమార పర్వత నుంచి సుబ్రహ్మణ్య, బీదరహళ్లి వరకు చామరాజనగర నాగమలై నుంచి తలకావేరి వరకు, నిశానమెట్టి నుంచి తలకావేరి వరకు అనుమతులు ఇస్తున్నట్లు వెల్లడించారు. చిక్కబళ్లాపుర స్పందగిరి పర్వతం యువత ఎక్కడానికి అంతర్జాలంలో పేర్లు నమోదు కాకుండా కొన్ని ప్రైవేట్ సంస్థలు బ్లాక్ చేశాయని, ఇందులో పర్యాటక శాఖలోని కొందరు ఉద్యోగులు ప్రైవేట్ సంస్థలతో కుమ్మక్కైనట్లు గుర్తించామని ఆయన వెల్లడించారు.

మృతుడి భార్యకు పరిహారం అందచేత

పావగడ తాలూకా కొడిగెనహళ్లి గ్రామంలో గత నెల 29న కురిసిన భారీ వర్షంలో పిడుగుపాటుతో మృతి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి భార్య విజయలక్ష్మికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5 లక్షల పరిహారం చెక్కును స్థానిక ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేశ్, తహసీల్దారు వరదరాజు కలిసి అందజేశారు. గురువారం జరిగిన కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు పీహెచ్ రాజేశ్, మాజీ అధ్యక్షుడు శంకరరెడ్డి, నాయకులు నాని, రవి, పూజారప్ప పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, పావగడ



విమానాశ్రయానికి విద్యుత్తు వాహన సౌకర్యం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నగరంలో వాయు కాలుష్యాన్ని నివారించేందుకు ఎక్కువ సంఖ్యలో విద్యుత్తు వాహనాలు అవసరమని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. ఇక్కడి కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద రెఫెక్ గ్రూప్ మొబిలిటి సంస్థ ఆధ్వర్యంలో 170 పరిసర స్నేహి ఈవీ ట్యాక్సీలను ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. విద్యుత్తు వాహనాలతో వాయు, శబ్ద కాలుష్యాలు అదుపులోకి వస్తాయన్నారు. ప్రభుత్వం విద్యుత్తు ఆధారిత వాహనాలను ప్రోత్సహిస్తుందని, ఛార్జింగ్ కేంద్రాల సంఖ్యనూ పెంచుతున్నట్లు వెల్లడించారు. రెఫెక్ సంస్థ డైరెక్టర్ యశ్‌జైన్ మాట్లాడుతూ నగరంలో ఈవీ కార్లను ప్రవేశపెట్టినట్లు చెప్పారు.


జెండా ఊపి వాహన సంచారాన్ని ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి శివకుమార్ తదితరులు

త్వరలో ఎగువభద్రకు నిధులు

చిత్రదుర్గం, న్యూస్‌టుడే: ఎగువభద్ర సాగునీటి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించిన రూ.5,300 కోట్లలో తొలి కంతు నిధులు రెండు నెలల్లోపు విడుదల అవుతుందని కేంద్ర జలశక్తి, రైల్వే సహాయ మంత్రి వి సోమణ్ణ హామీ ఇచ్చారు. ఆయనను చిత్రదుర్గంలో జిల్లా సాగునీటి ఆందోళన సమితి అధ్యక్షుడు లింగారెడ్డి నేతృత్వంలో ప్రతినిధులు కలిసి నిధులిచ్చి పనులు ప్రారంభించాలంటూ విన్నవించారు. స్పందించిన సోమణ్ణ కేంద్రం ఎగువభద్ర ప్రాజెక్టుకు నిధులు సమకూర్చడానికి కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సాంకేతిక పరమైన వివరాలు అందాల్సి ఉందన్నారు. అవి అందిన వెంటనే నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎంపీ గోవిందకారజోళ, ఎమ్మెల్యే చంద్రప్ప, ఎమ్మెల్సీ నవీన్, సమితి ప్రధాన కార్యదర్శి దయానంద్, సంచాలకుడు చిక్కప్పనహళ్లి షణ్ముఖ, రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు కేపీ భూతయ్య తదితరులున్నారు.


కేంద్ర మంత్రి సోమణ్ణకు వినతిపత్రం ఇస్తున్న లింగారెడ్డి, పక్కన ఎంపీ గోవిందకారజోళ

పెద్దలను గౌరవించడం సంప్రదాయం

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపించవద్దని జిల్లాధికారి పీఎన్ రవీంద్ర విజ్ఞప్తి చేశారు. పెద్దలు ఇంట్లో ఉంటే పిల్లలకు అనుభవాలు, సంప్రదాయం, సంస్కృతి బోధిస్తూ ఉంటారని చెప్పారు. జిల్లా పాలన యంత్రాంగం నిర్వహించిన సీనియరు సిటిజన్ల దినోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఉమ్మడి కుటుంబాలు అంతరించి, విచ్ఛిన్న కుటుంబాలు పెరిగాకే ఎక్కువ మంది బాలలు దారి తప్పుతున్నారని గుర్తు చేశారు. కుటుంబంలో వస్తున్న గొడవలు చూడలేక శ్రీమంతులైన కొందరు వృద్ధులు కూడా వృద్ధాశ్రమాలకు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు ఎదుర్కొంటున్న సీనియరు సిటిజన్లు సహాయవాణిని ఫోన్ చేయాలని సూచించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బీవీ కృష్ణ, అధికారులు ఈశ్వరప్ప, వెంకటేశ్‌రెడ్డి, ఎన్ గంగాధరయ్య, కేఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగిస్తున్న జిల్లాధికారి రవీంద్ర

ఇళ్ల వద్దే దివ్యాంగులకు విద్యా శిక్షణ

చిత్రదుర్గం, న్యూస్‌టుడే: శారీరక వైకల్యం, ఇతర కారణాలతో పాఠశాలలకు రాలేని 34 మంది దివ్యాంగ పిల్లలకు ఇళ్ల వద్దనే విద్యా శిక్షణ ఏర్పాటు చేసినట్లు జడ్పీ సీఈఓ సోమశేఖర్ తెలిపారు. ఆయన గురువారం శిక్షణ పొందుతున్న పిల్లలకు కిట్లు అందజేసి మాట్లాడారు. వారికి అవసరమైతే ఫిజియోథెరపీ చికిత్స సదుపాయం ఇళ్ల వద్దే కల్పించాలని ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. వారికి ఆధార్, యూడీఐడీ కార్డులు చేయించి ప్రభుత్వం నుంచి అన్ని రకాల వసతులు అందజేయాలన్నారు. అర్హులకు శిష్య వేతనాలూ మంజూరు చేయాలన్నారు. ఆసక్తి కలిగిన వారికి వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి వారి కాళ్లపై వారే నిలుచునేలా తయారుచేయాలని కోరారు. ఆయన వెంట జడ్పీ ఉప కార్యదర్శి తిమ్మప్ప, జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రేణుప్రసాద్, డీఈవో మంజునాథ్ తదితరులున్నారు.

సమాజ సేవలోనే ఆనందం

బెంగళూరు (జాలహళ్లి) న్యూస్‌టుడే : సమాజంలో పేద ప్రజలకు ఉత్తమ సేవ లందించినప్పుడే ఆనందంగా ఉంటుందని మాజీ సీఎంసీ అధ్యక్షుడు కె.సి.అశోక్ తెలిపారు. ఇక్కడ కమ్మగుండనహళ్లిలో అశోక్ పాలిటెక్నికల్ కళాశాల అవరణలో కేబీసీ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎంఎస్ రామయ్య ఆసుపత్రి ద్వారా ఉచిత శస్త్ర చికిత్సలు చేయిస్తున్న డాక్టర్ పి.ఎస్.లక్ష్మీనారాయణ, డాక్టర్ కామత్‌ను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కె.సి.రోషన్ అశోక్, డీఆర్ అకాడమీ ప్రిన్సిపల్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


లక్ష్మీనారాయణ, కామత్‌ను సత్కరిస్తున్న కె.సి.అశోక్, డైరెక్టర్లు

నగరంలో ఈనాడు

- ఉదయం 8 గంటలకు యలహంక చౌడేశ్వరీదేవి ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు.
- ఉదయం 10 గంటలకు హలసూరు బెంగాల్ భవన్‌లో శరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభం.
- ఉదయం 11 గంటల నుంచి కుమార కృపా రహదారిలోని కర్ణాటక చిత్రకళా పరిషత్తు ఆవరణలో చేనేత హస్తకళా ప్రదర్శన కొనసాగింపు.
- సాయంత్రం 5.45 గంటలకు జేసీ రహదారిలోని సెయింట్ థెరేసమ్మ దేవస్థానంలో దివ్య బలిపూజ, అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు.

- న్యూస్‌టుడే, బెంగళూరు (యశ్వంతపుర)

దుర్గాంబ.. నమోస్తుతే

శరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభం


ప్రత్యేకాలంకారంలో ఆది నాంచారమ్మ

కోలారు, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భాగంగా కోలారు జిల్లా ముళబాగిలు పరిధి పల్లెగారపాళ్య అంజనాద్రి బెట్టపైనున్న ఆదినాంచారమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. బుధవారం సాయంత్రం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శరన్నవరాత్రులు ప్రారంభం కావడంతో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కనిపించింది.

బెంగళూరు (యశ్వంతపుర): కోలారు జిల్లా కేజీఎఫ్‌లో నివసిస్తున్న తెలంగాణ వాసులు బతుకమ్మ పండగను సంప్రదాయంగా జరుపుకొన్నారు. స్థానిక బెమల్ అధికారుల నివాస ప్రాంతంలో తెలుగు కళా సమితి నేతృత్వంలో మహిళలు బతుకమ్మను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. బతుకమ్మ చుట్టూ చేరి పాటలు పాడుతూ నృత్యం చేశారు.

దసరా బొమ్మల కొలువు

బెంగళూరు (యశ్వంతపుర): దేవి నవరాత్రుల్లో భాగంగా బొమ్మల కొలువుకు శ్రీకారం చుట్టారు. నగరంలోని తలఘట్టపురలోని తానా శాంతకుమార్ నివాసంలో బొమ్మల కొలువు ప్రత్యేకార్షణగా నిలిచింది. శాంతకుమార్ కుటుంబం 70 ఏళ్లుగా బొమ్మలు కొలువు నిర్వహిస్తోంది. దసరా ఉరేగింపు, గరుడ ఉత్సవాలు, వివిధ దేవత మూర్తులతో పాటు 3 వేల కొయ్య బొమ్మలను కొలువులో ఉంచారు. తొమ్మిదిరోజుల పాటు సాగే ఈ కొలువులో ఉదయం, సాయంత్రం బొమ్మలకు తమ కుటుంబ సభ్యులు పూజలు చేస్తారని శాంతకుమార్ తెలిపారు.

బెంగళూరు (కెంగేరి): మంగళూరు కుద్రోళి గోకర్ణనాథేశ్వర ఆలయంలో బుధవారం కేంద్ర మాజీ మంత్రి జనార్ధనపూజారి శారదాదేవి, నవదుర్గాదేవతలు, వినాయకుని విగ్రహాలను ప్రతిష్ఠించి దసరా వేడుకలను ప్రారంభించారు. వేలాది మంది భక్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు.


కేజీఎఫ్‌లో బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలు


శారదాదేవి విగ్రహ ప్రతిష్ఠోత్సవంలో భక్తులు


తానా శాంతకుమార్ ఇంట్లోని బొమ్మల కొలువు

బళ్ళారి

•బళ్ళారి •రాయచూరు

ఘనంగా నవరాత్రి ఉత్సవాలు


శాంభవి ప్రతిమ స్థాపన

రాయచూరు, న్యూస్‌టుడే : నగరంలో దసరా నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అల్లం ప్రభు కాలనీలోని మాతా తాయమ్మ దేవి సన్నిధానంలో అంబాభవానీ విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. చంద్రబండ రహదారిలోని జగన్మాత దేవస్థానం నుంచి విగ్రహాన్ని మంగళ వాయిద్యాలు, మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. శాంభవి మందిరంలో అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించారు. కిల్లే బృహన్మఠం స్వామి శాంతమల్ల శివాచార్యులు, మఠం కార్యదర్శి రేణుకారాధయ్య స్వామి నేతృత్వంలో పూజలు జరిగాయి. వివిధ ప్రాంతాల్లోని దేవి ఆలయాల్లో వేడుకలు మొదలయ్యాయి.

వాడవాడలా శరన్నవ శోభ

మాన్వి, న్యూస్‌టుడే : తాలూకాలోని వివిధ క్యాంపుల్లో శరన్నవ రాత్రి వేడుకల ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. రామనాథ్‌క్యాంపులో మొదటి రోజు అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయాలను అలంకరణలతో తీర్చిదిద్దారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.



బాలా త్రిపురసుందరీదేవి అలంకారం


రాచనగరికి దసరా రాజసం!


చాముండి ఆలయంలో హారతి స్వీకరిస్తున్న సిద్ధరామయ్య, హంప నాగరాజయ్య



మైసూరు, న్యూస్‌టుడే : వృశ్చిక లగ్నంలో నాడదేవత చాముండి ఉత్సవ మూర్తికి సాహితీవేత్త, నాడోజ, హంప నాగరాజయ్య పుష్పార్చన చేసి అధికారికంగా దసరా ఉత్సవాలను గురువారం ఉదయం ప్రారంభించడంతో భక్తుల జయజయనాదాలు మిన్నంటాయి. అంతకు మునుపు.. సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు హెచ్‌కే పాటిల్, హెచ్‌సీ మహదేవప్ప, ఎమ్మెల్యేలు జీటీ దేవేగౌడ, తన్వీర్ సేఠ్ తదితరులు అమ్మవారి ఆలయంలో పూజలు చేసుకున్నారు. ధ్వజ స్తంభానికి సిద్ధరామయ్యతో కలిసి 'హంప' పూజ చేశారు. ఆలయం వెలుపల డీకే శివకుమార్ కొబ్బరికాయ కొట్టి, ప్రభుత్వంపై ఉన్న దిష్టి తొలగిపోవాలని కోరుకున్నారు. కన్నడ భాష, ప్రాంతం, నీటి కోసం పోరాటాలు చేస్తున్న వారిని నిందితులుగా కాకుండా, ప్రేమ, అభిమానాలతో చూడాలని హంప నాగరాజయ్య పిలుపునిచ్చారు. ఇజ్రాయిల్-పాలస్తీనా, రష్యా-ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం ఆగిపోవాలని తాను అమ్మవారిని కోరుకున్నానని తెలిపారు. ఉత్సవాలకు మైసూరు నగరం నవ వధువులా సింగారించుకుంది. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. క్రీడా పోటీలు, పుస్తక మేళా, జానపద రంగ ఉత్సవం, శిల్పకళా శిబిరం, ఆహార మేళా, చలనచిత్రోత్సవాలు, ఫలపుష్ప ప్రదర్శన తదితరాలు విజయదశమి వరకు కొనసాగనున్నాయి. చివరి రోజు జంబూ సవారి, కాగడాల ప్రదర్శనతో ఉత్సవాలకు తెరపడనుంది. ఈ ఏడాది అన్ని ప్రాంతాల్లో చక్కగా వర్షాలు కురవడంతో ఘనంగా శరన్నవరాత్రులను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాచనగరి మొత్తం పండగ వాతావరణం నెలకొంది. అన్ని కూడళ్లు, వీధులు, పురాతన భవంతులను విద్యుత్తు దీపాలతో అలంకరించారు.


ధ్వజపూజలో హంప నాగరాజయ్యకు తోడుగా ముఖ్యమంత్రి


బనశంకరి అమ్మ వారికి అలంకారం


పూజ అనంతరం కుంకుమ పెట్టించుకుంటున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్


ఆలయం వెలుపల కొబ్బరికాయ కొడుతున్న డీకే శివకుమార్

మాట తప్పని.. మచ్చలేని సీఎం సిద్ధరామయ్య


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బోసురాజు

మాన్వి, న్యూస్‌టుడే : సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ఉత్తమ పాలన అందిస్తున్నారని ఆయనపై ఎలాగైనా బురద చల్లాలని కేంద్రం ప్రయత్నాలు చేస్తోందని, కేంద్రం ఆడుతున్న నాటకాలు సాగవని చిన్ననీటి శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి ఎన్.ఎస్.బోసురాజు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆయన ఇక్కడి భారత్‌జోడో కాంగ్రెస్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి శనివారం ఉదయం 10గంటలకు రాయచూరులో గోకాక్ పోరాట కార్యక్రమంలో పాల్గొంటారని, 11.30 గంటల నుంచి మాన్విలో పర్యటిస్తారన్నారు. ఆయనతో పాటు మంత్రులు సతీష్ జార్జ్‌హొళి, మహదేవప్ప, మునియప్ప, రహీంఖాన్, శరణప్రకాష్ పాటిల్, శివరాజ్ తంగడిగి తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు. సిద్ధరామయ్య ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని నిలుపుకున్నారన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే కల్యాణ కర్ణాటక ప్రాంతానికి ఆర్టికల్ 371జె అమల్లోకి వచ్చిందన్నారు. తిరిగి ఆయన సీఎం అయ్యాక కల్యాణ కర్ణాటక ప్రాంతాభివృద్ధికి రూ.5వేల కోట్లను విడుదల చేశారన్నారు. 5న మాన్విలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని వివరించారు. రూ.1000 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు చెప్పారు. మినీవిధాన సౌధ టెండర్ దశలో ఉందని, దీని అంచనా వ్యయం రూ.10 కోట్ల నుంచి రూ.15కోట్లకు పెంచినట్లు తెలిపారు. మాన్వి తాలూకాలో ఐటీఐ కళాశాల భవనం, బస్టాండ్‌కు శంకుస్థాపన, వివిధ వసతి నిలయాల ప్రారంభోత్సవాలు ఉంటాయన్నారు. నవలి వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి తీరుతామని చెప్పారు. ఇందుకు సంబంధించి మూడు రాష్ట్రాల మధ్య చర్చలు జరుగుతున్నట్లు చెప్పారు. చికల్‌పర్వి బ్రిడ్జి కమ్ బ్యారేజీ, సిరివార మినీ విధానసౌధ, క్రీడాప్రాంగణం టెండర్ దశలో ఉన్నందున మరో సారి వీటికి శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గఫూర్‌సాబ్, కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఈరణ్ణ. రామణ్ణ ఇరబగెరా, శాంతప్ప, అమరేగౌడ, బాలస్వామి కొడ్లి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ జాప్యంపై సీఎం ఎదుట నిరసన


విలేకరులకు వివరిస్తున్న నరసప్ప


రాయచూరు, న్యూస్‌టుడే : దళితుల వర్గీకరణ చేయకుండా ప్రభుత్వం చేస్తున్న జాప్యాన్ని వ్యతిరేకిస్తూ జిల్లాకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎదుట నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన చేస్తామని మాదిగ దండోరా రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్రాధ్యక్షుడు నరసప్ప వెల్లడించారు. ఆయన గురువారం పత్రికాభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు మేరకు వర్గీకరించేందుకు హర్యాణా మంత్రివర్గంలో తీర్మానం చేశారన్నారు. ఇక్కడి కాంగ్రెస్ సర్కార్ వేచి చూసే ధోరణి వ్యవహరించడం శోచనీయమని వ్యాఖ్యానించారు. తాము సిద్ధరామయ్యను కలిసినపుడు మల్లికార్జున ఖర్గే ఒప్పుకుంటే ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పడం బాధాకరమన్నారు. న్యాయస్థానం ఆదేశం ముందు ఎవరూ గొప్ప వారు కాదని తెలుసుకోవాలన్నారు. విభజనతో మాల సామాజిక వర్గానికి ఎలాంటి అన్యాయం జరగదన్నారు. సమావేశంలో ప్రతినిధులు దూళయ్య, రంజిత్, అనిల్‌కుమార్, భీమేశ్, నరసింహులు పాల్గొన్నారు.

'జనాభా ఆధారంగా నిధులు కేటాయించాలి'


పాత్రికేయులకు వివరిస్తున్న శాంతప్ప, తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే : వెనుకబడిన వర్గాల జనాభాకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని జిల్లా వెనుకబడిన వర్గాల సమాఖ్య అధ్యక్షుడు కె.శాంతప్ప డిమాండ్ చేశారు. జనగణన చేసిన కాంత్‌రాజ్ నివేదికను బహిరంగ పరచాలని మాన్వి పర్యటనకు విచ్చేస్తున్న సీఎం సిద్ధరామయ్యకు విజ్ఞప్తి చేస్తామని ఆయన తెలినారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 60 శాతం జనాభా ఉన్న బీసీల నిగమలకు ఏటా కేటాయిస్తున్న రూ.5 కోట్ల నిధులు ఏ మాత్రం సరిపోవని, పెంచాలని ముఖ్యమంత్రికి విన్నవిస్తామని చెప్పారు. రాయచూరులో మాజీ ముఖ్యమంత్రి దేవరాజ్ అరసు భవనం నిర్మాణానికి నాలుగు ఎకరాల భూమి మంజూరు చేయించాలన్నారు. ఆర్టీవో కూడలి వద్ద ప్రభుత్వం భూమి ఉన్నట్లు తమకు స్పష్టమైన సమాచారం ఉందన్నారు. నాలుగేళ్లుగా బీసీల సమస్యలపై స్పందిస్తున్నట్లు వివరించారు. వెనుకబడిన వర్గాల నేత సిద్ధరామయ్యకు వ్యతిరేకంగా జరుగుతున్న రాజకీయ కుట్రలను కలసికట్టుగా అడ్డుకునే సమయం ఆసన్నమైందని తెలిపారు. ఈ నెల 5న మాన్విలో జరుగనున్న స్వాభిమాన సభకు బీసీలు హాజరై మద్దతు ప్రకటించాలని కోరారు. సమావేశంలో ప్రతినిధులు శ్రీకాంతరావ్, జంబణ్ణ యక్లాసపూర్, విజయ భాస్కర్ ఇటగి, ఖాజనగౌడ, పంపాపతి, సురేఖా, ఆంజనేయ యాదవ్ పాల్గొన్నారు.

జిల్లా బంద్ విజయవంతం


అంబేడ్కర్ కూడలి వద్దకు ర్యాలీగా వస్తున్న దళితులు

రాయచూరు, న్యూస్‌టుడే : దళిత వర్గీకరణ కోసం రిజర్వేషన్ ఐక్య పోరాట సమితి గురువారం నిర్వహించిన జిల్లా బంద్ విజయవంతమైంది. రాయచూరు నగరంలో మంచి స్పందన కన్పించింది. దుకాణాలు, హోటళ్లు, పెట్రోలు బంకులు, చిత్ర మందిరాలు, విద్యాలయాలు పూర్తిగా మూతపడ్డాయి. కొన్ని ఆటోలు సంచరించినా ప్రయాణికులు లేక ఖాళీగా వెళ్లాయి. కర్ణాటక ఆర్టీసీ బస్సులు రహదారి మీదకు రాలేదు. బస్సులను డిపోకు పరిమితం చేయడంతో ఆర్టీసీ బస్టాండ్ బోసిపోయింది. హైదరాబాద్ నుంచి వచ్చిన తెలంగాణ బస్సులను సరిహద్దులోని టై రోడ్డు, గద్వాల్ బస్సులను నందిని వద్ద నిలిపివేశారు. అక్కడి నుంచి ప్రయాణికులు ఆటోలు, ఇతర వాహనాల్లో రాయచూరుకు చేరుకున్నారు. ఇక్కడి నుంచి ప్రైవేట్ జీపుల్లో వెళ్లారు. ఆందోళనకారులు ఉదయం నుంచి వాహనాల్లో తిరుగుతూ బంద్‌కు సహకరించాలన్న విజ్ఞప్తికి వ్యాపార, వాణిజ్య వర్గాలు మద్దతు ప్రకటించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు పని చేసినా రద్దీ లేక వెలవెలబోయాయి. ప్రముఖ మార్కెట్ ప్రాంతాలైన నేతాజీనగర్, తీనకందిల్, స్టేషన్ రహదారి, గంజ్, హరిహర రోడ్డు, కూరగాయల మార్కెట్ నిర్మానుష్యంగా మారాయి. అంబేడ్కర్ కూడలికి దగ్గర్లో దళిత సంఘాలు ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ సర్వోన్నత న్యాయస్థానం వర్గీకరణ అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగిస్తూ తీర్పు వెలువరించి మూడో నెలలో పడినా సిద్ధరామయ్య సర్కార్ జారీకి ముందడుగు వేయనందునే జిల్లా బంద్ నిర్వహించినట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వర్గీకరణ చేస్తామని చిత్రదుర్గంలో సభలో సిద్ధరామయ్య ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించుకొని అమలు చేయాలని ఒత్తిడి తెచ్చారు. సమితి ప్రతినిధులు విరూపాక్షి, బాలస్వామి కొడ్లి, అంబణ్ణ అరోలి, తిమ్మప్ప పిరంగి, పి.యల్లప్ప, నరసింహులు మాడగిరి, జె.బి.రాజు, భీమణ్ణ మంచాల తదితరులు నేతృత్వం వహించారు. మధ్యాహ్నం ధర్నా వద్దకు విచ్చేసిన జిల్లా పాలనాధికారి నితీష్‌కు వినతి పత్రం అందజేసి ముఖ్యమంత్రికి పంపాలని విజ్ఞప్తి చేశారు.

మాన్వి : సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం వివిధ దళిత సంఘాల ఆధ్వర్యంలో మాన్వి, సిరివార తాలూకాల్లో బంద్ పాటించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బంద్ జరిగింది. పట్టణాల్లో వ్యాపారులు, ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు ఇచ్చి సహకరించారు. పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. సాయంత్రం వరకు వాహనాలు తిరగలేదు. బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. ఆందోళనకారులు ప్రముఖ కూడళ్ల వద్ద టైర్లను కాల్చి నిరసన తెలిపారు. ద్విచక్రవాహనాలపై ర్యాలీ చేసి రోడ్లపై బైఠాయించారు. దళిత సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపునకు అన్ని వర్గాలు మద్దతు ప్రకటించాయి. వివిధ పార్టీల ప్రముఖులు బంద్‌లో పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ అబ్దుల్‌వాహిద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్, బాలస్వామి కొడ్లి, అక్బర్‌సాబ్, యల్లప్ప బాదరదిన్ని, బసవరాజ్ నక్కుంది, తాయప్ప, దేవరాజ్, ప్రభురాజ్, రవికుమార్, పరమేష్, హనుమేష్, నరసప్ప, వివిధ దళిత సంఘాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



నిర్మానుష్యంగా స్టేషన్ రహదారి


మాన్వి : టైర్లు కాల్చి నిరసన తెలుపుతున్న ఆందోళనకారులు


మాన్వి : ప్రయాణికులు లేక బోసిపోయిన బస్టాండు

ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరులోని వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయం ఆవరణలో ఈ నెల 5న నిర్వహిస్తున్న కర్ణాటక సంభ్రమ-50, గోకాల్ పోరాట నేపథ్యం, సమృద్ధ కర్ణాటక దిక్సూచి కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా పాలనాధికారి నితీష్ కోరారు. ఆయన గురువారం జిల్లా పాలనాధికారి సభాభవన్‌లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి శివకుమార్, మంత్రులు శివరాజ్ తంగడిగి, శరణప్రకాష్ పాటిల్, బోసురాజు, కన్నడ అభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు డాక్టర్ పురుషోత్తం బిళిమలె హాజరవుతారన్నారు. గోకాక్ ఉద్యమంలో పాల్గొన్న లింగప్ప, శివశరణప్ప వాలి, బసప్ప, నింగణ్ణ కుంటె, గోవిందు, కలీంబాషాను సన్మానిస్తామని విశదీకరించారు. శనివారం ఉదయం 8 గంటలకు బసవేశ్వర కూడలి వద్ద 200 కళా బృందాలతో ప్రారంభమయ్యే ఊరేగింపును మంత్రి శరణప్రకాష్ ప్రారంభిస్తారని తెలిపారు. ఎస్పీ పుట్ట మాదయ్య మాట్లాడుతూ సీఎం పర్యటించే సింధనూరు, రాయచూరు, మాన్వి మార్గంలో 44 చోట్ల గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జడ్పీ సీఈవో రాహుల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి నితీష్

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

03-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.80	1617.37
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10,203	1825
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10,176	9,728
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.382	54.267

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

'మంత్రి, ఎమ్మెల్యే విఫలం'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్

మాన్వి, న్యూస్‌టుడే : మంత్రి ఎన్.ఎస్.బోసురాజు, ఎమ్మెల్యే హంపయ్యనాయక్ నియోజకవర్గం రైతుల సంక్షేమాన్ని కాపాడటంలో విఫలం చెందారని మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్ ఆరోపించారు. గురువారం స్థానిక పత్రికా భవనంలో ఆయన దళ్ అధ్యక్షుడు ఈరణ్ణ మర్లట్టి, ఇతర సభ్యులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తుంగభద్ర జలాశయంలో నీరునా కాలువలకు చేరటంలేదని, రైతులు పంటలు కోల్పోతున్నారని తెలిపారు. తుంగభద్ర ఎడమ కాలువ పైభాగంలో రెండు లక్షల ఎకరాలకు పైగా అక్రమంగా పంటలు సాగవుతున్నాయన్నారు. దీన్ని నిలువరించి దిగువకు నీరు తీసుకురావటంలో వీరిరువురూ విఫలమైనట్లు వెల్లడించారు. కాలువపై పర్యవేక్షణ చేసేందుకు అధికారులే లేరన్నారు. నీటిపారుదల శాఖలో అధికారుల, సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని సూచించారు. మాన్వి, సిరివార ఆసుపత్రుల్లో వైద్యులు లేరని దీంతో ప్రజలకు ఆరోగ్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయన్నారు. కుమారస్వామి సీఎంగా ఉన్నప్పుడు రూ.80 కోట్లకు డీపీఆర్ అయిన యెడివాళ ఎత్తిపో.తలపై సీఎం సిద్ధరామయ్య దృష్టికి తెస్తామన్నారు. శనివారం మాన్విలో ముఖ్యమంత్రి సిద్ధరాయ్యకు సమస్యలపై వినతి పత్రం అందజేస్తామన్నారు. సమావేశంలో కౌన్సిలర్ బాషా, నాయకులు రవికుమార్, మౌనేశ్, సుభాన్‌బేగ్, విజయ్‌కోట్నేకల్, అమరేశ్, చెన్నబసవయ్య తదితరులు పాల్గొన్నారు.

శరవేగంతో వైద్య రంగం అభివృద్ధి



సమ్మేళనంలో ప్రసంగిస్తున్న రాజేంద్రరెడ్డి

రాయచూరు, న్యూస్‌టుడే : 'వైద్య రంగంలో కార్యకలాపాలు-ముందంజ' అనే అంశంపై నవోదయ వైద్య కళాశాలలో గురువారం జాతీయ సమ్మేళనం మొదలైంది. నవోదయ విద్యా సంస్థల అధ్యక్షుడు ఎస్.రాజేంద్రరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. నిష్ణాతులైన వైద్యుల అనుభవాలను విద్యార్థులు తెలుసుకునేందుకు సమ్మేళనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి విషయాన్ని శ్రద్ధగా ఆలకిస్తే నిపుణులైన డాక్టర్లుగా రాణించేందుకు దోహదపడుతుందన్నారు. చర్చా వేదికలు, అధ్యయనాల్లో వైద్య లోకం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించడం, వాటిని అధిగమించే మార్గాలను అన్వేషించాలని ఆయన సూచించారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దేవానంద మాట్లాడుతూ వైద్య రంగం శరవేగంతో అభివృద్ధి చెందుతున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 530 మంది వైద్య విద్యార్థులు హాజరయ్యారు. రోబోటిక్ సర్జన్ మనీశ్ జోషి, నవోదయ సంస్థల రిజిస్ట్రార్ డాక్టర్ తాడిపత్రి శ్రీనివాస్, వైద్య కళాశాల ఉప ప్రిన్సిపల్ డాక్టర్ ఆనంద్, ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ అరుణ్ నాయక్, వైద్యులు జితిన్‌రెడ్డి, వర్షిణి పాల్గొన్నారు.

తుపాకులతోనే ఆత్మరక్షణ

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : బీఎంటీసీ సిబ్బంది ఆత్మరక్షణకు తుపాకులు ఇవ్వాలని కోరుతూ సంస్థ ఎండీకి కొందరు లేఖలు రాశారు. మంగళవారం వైట్‌ఫీల్డ్‌లో యోగేశ్ అనే కండెక్టర్‌పై ఒక యువకుడు కత్తితో దాడి చేశాడు. గతంలో పలుమార్లు సిబ్బందిపై ఇలానే దాడులు చేశారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని తమకు తుపాకీలను మంజూరు చేయాలని సిబ్బంది లేఖలు రాశారు.

పురస్కార గ్రహీత పాపారెడ్డికి అభినందన


విలేకర్లతో మాట్లాడుతున్న బసవరాజరెడ్డి, తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే : ఐకాన్ ఆఫ్ లెజెండ్ పురస్కార గ్రహీత, మాజీ ఎమ్మెల్యే ఎ.పాపారెడ్డికి ఈ నెల 6న అభినందన సభ నిర్వహిస్తున్నట్లు మున్నూరు కాపు సమాజం ప్రధాన కార్యదర్శి జి.బసవరాజరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక వర్గాన్ని బలోపేతం చేసేందుకు దశాబ్దాలుగా శ్రమిస్తున్న పాపారెడ్డికి గత నెలలో హైదరాబాద్‌లో ఎనిమిది రాష్ట్రాలకు చెందిన కాపు సంఘాల నాయకులు, అధికారులు పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు వెల్లడించారు. రాయచూరుకు చెందిన ఈయనకు ప్రశస్తి రావడం గొప్ప విషయంగా భావించి సత్కారం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం పాపారెడ్డి ఇంటి వద్ద నుంచి టాపులేని జీపులో ఊరేగింపుగా బయలుదేరుతామని.. ప్రముఖ వీధుల మీదుగా సమావేశం జరిగే వీరాంజినేయ కల్యాణ మంటపం వద్దకు తీసుకెళ్తామని వివరించారు. సమాజం యువత, మహిళలు, విద్యార్థులు, శ్రేయోభిలాషులు హాజరై సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కాపు సమాజం అధ్యక్షుడు బెల్లం నరసారెడ్డి, పుండ్ల రాజేంద్రరెడ్డి, కృష్ణమూర్తి, గుడిసె నరసారెడ్డి, ఎన్.శ్రీనివాసరెడ్డి, శేఖరరెడ్డి, రాఘవేంద్ర ఉట్కూరు పాల్గొన్నారు.